www.vaarthavedhikasurya.com
PRGI.NO:- TGTEL/25/A0305
# వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి YADADRI BHUVANAGIRI | సంపుటి: 1 VOLUME : 1 | సంచిక: 309 ISSUE : 309 | ఆదివారం, 5 ఏప్రిల్, 2026 SUNDAY, APRIL 5, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి EDITOR : POLOJU SRINIVASA CHARY | పేజీలు: 8 PAGES : 8 | వెల: 5-00 RS : 5-00 |
|---|---|---|---|---|---|---|

హైకోర్టు జడ్జిల నివాస సముదాయానికి
## నేడు శంకుస్థాపన

- భూమిపూజ చేయనున్న సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్



2 లో..

# ఇక ప్రళయమే..

- 'హర్మూజ్' తెరవడానికి ఇచ్చిన గడువు 48 గంటలే.. గుర్తుందా?
- ట్రూత్ పోస్టులో ఇరాన్‌కు ట్రంప్ అల్టిమేటం
- ఒకేరోజు రెండు అమెరికా యుద్ధ విమానాలను కూల్చిన ఇరాన్..
- 2 హెలికాప్టర్‌లపై కూడా దాడి



**వాషింగ్టన్ డీసీ/న్యూఢిల్లీ:** పశ్చిమాసియా దేశమైన ఇరాన్‌పై భీకర దాడులు చేయడానికి సమయం మించిపోతున్నదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శనివారం హెచ్చరించారు. ఒప్పందం కుదుర్చుకోవడానికి లేదా హార్మూజ్ జలసంధిని తిరిగి తెరవడానికి ఇరాన్‌కు 10 రోజుల గడువు ఇచ్చిన విషయం గుర్తుందా అని ఆయన ట్రూత్ సోషల్ పోస్టులో ప్రశ్నించారు. సమయం మించిపోతున్నది. ఇరాన్‌పై ప్రళయం విరుచుకు పడడానికి 48 గంటల సమయం మాత్రమే ఉంది అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. శుక్రవారం ఇరాన్ వైమానిక దళాలు రెండు అమెరికా యుద్ధ విమానాలను కూల్చివేసిన తర్వాత ట్రంప్ ఈ హెచ్చరిక జారీ చేశారు. ఇరాన్ అభ్యర్థన మేరకు ఆ దేశ ఇంధన మౌలిక సదుపాయాలపై ఏప్రిల్ 6 వరకు దాడుల చేయమని అమెరికా పేర్కొంది.

### ఒకేరోజు రెండు అమెరికా యుద్ధ విమానాలను కూల్చిన ఇరాన్..

ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధంలో అమెరికాకు వరుస దెబ్బలు తగులుతున్నాయి. ఒకేరోజు అగ్రరాజ్యానికి చెందిన రెండు యుద్ధ విమానాలను ఇరాన్ కూల్చేసింది. మరో రెండు హెలికాప్టర్లపై కూడా దాడి జరిగింది. ఈ ఘటనల్లో ఇద్దరు పైలట్లు సురక్షితంగా బయటపడగా మరో పైలట్ గల్లంతయ్యాడు. అమెరికాకు చెందిన ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగల్ విమానాన్ని ఇరాన్ శుక్రవారం దాడి చేసి కూల్చేసింది. ఇందులో ఓ పైలట్, వెపన్ సిస్టమ్ అధికారి ఉన్నారు. ఆ ఇద్దరిలో ఒకరిని మిగతా 2లో..



# 'బాసర' అభివృద్ధికి
# రూ.225 కోట్లు

- ఆలయ అభివృద్ధి పనుల కోసం మంజూరు
- రేపు సీఎం చేతుల మీదుగా భూమిపూజ
- రాష్ట్రంలోని ఆలయాల పరిసరాల్లో..ఇకపై తిరుమల తరహా నిబంధనలు
- రాజకీయ పార్టీల సభలు, ప్రదర్శనలు, జెండాలు లేకుండా ఆధ్యాత్మికతకు పెద్దపీట
- ఎంతటి వీఐపీలైనా ఆలయ ప్రాంగణంలోకి వాహనాలకు నో ఎంట్రీ: సీఎం రేవంత్‌రెడ్డి
- ఆలయ అభివృద్ధి పనులపై సమీక్ష

**హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 4:** బాసరలోని జ్ఞాన సరస్వతి అమ్మవారి దేవస్థానం అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.225 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఆలయ అభివృద్ధి పనులకు సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా భూమిపూజ నిర్వహించనున్నారు. పవిత్ర గోదావరి నదీ తీరాన ఉన్న బాసర అమ్మవారి క్షేత్రాన్ని నిత్యం వేలాది మంది భక్తులు వచ్చి దర్శించుకుంటారు. నిత్యం అక్షరాభ్యాసాలతో ఈ క్షేత్రం విరాజిల్లుతుంది. వసంత పంచమి, తదితర పవిత్ర రోజుల్లో ఇంకా ఎక్కువ మంది భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తుంటారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగున ఉన్న మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా దర్శనానికి తరలివస్తారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలకు లక్షలాది మంది భక్తులు వస్తారని అంచనా. అయితే ప్రస్తుతమున్న దేవాలయ ప్రాంగణం ఇరుకుగా ఉండటమే కాకుండా క్యూ కాంప్లెక్స్ సౌకర్యం లేకపోవడంతో భక్తులకు ఇబ్బందికరంగా మారింది. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించింది. సీఎం రేవంత్‌రెడ్డి శృంగేరి పీఠాధిపతుల ఆశీర్వాదం, అనుమతి తీసుకుని ఆలయ పునరుద్ధరణ మిగతా 2లో..



## ఘోర రోడ్డు ప్రమాదం

- బావిలోకి దూసుకెళ్లిన కారు..
- 9 మంది దుర్మరణం

మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బావిలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారులో ఉన్న 9 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారని మృతుల బంధువులు తెలిపారు. నాసిక్ జిల్లా డిండోరీ తాలూకాలో ఈ ప్రమాదం జరిగింది. శివాజీ నగర్‌లో ఓ మిగతా 2లో..

# కేసీఆర్ క్యాంప్ ఆఫీస్‌పై దాడి

- అధికారిక కార్యాలయంలో సీఎం రేవంత్ ఫొటోతో హంగామా
- దాడిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వంటేరు ప్రతాప్‌రెడ్డి
- సోమవారం గజ్వేల్ బంద్‌కు పిలుపునిచ్చిన బీఆర్ఎస్



**గజ్వేల్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 4:** మాజీ ముఖ్యమంత్రి, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ అధికారిక క్యాంప్ కార్యాలయంపై శనివారం కాంగ్రెస్ శ్రేణులు దాడి చేశారు. కార్యాలయ సిబ్బందిపైనా దాడికి యత్నించారు. క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫొటో పెట్టడంతో పాటు అక్కడ ఉన్న ఫర్నిచర్, కిటికీల అద్దాలను పగలగొట్టి నానా హంగామా సృష్టించారు. దాడికి నిరసనగా సోమవారం గజ్వేల్ బంద్‌కు బీఆర్ఎస్ పార్టీ పిలుపునిచ్చింది. గజ్వేల్ క్యాంప్ ఆఫీస్‌పై కాంగ్రెస్ దాడిని బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో గజ్వేల్ క్యాంప్ ఆఫీస్‌పై జరిగిన దాడి.. ప్రజాస్వామ్యంపై సీఎం చేయించిన దాడి అని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. దాడి చేసిన వారిని గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని డీజీపీని డిమాండ్ చేశారు. ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. రెండు రోజుల క్రితం సిద్దిపేట క్యాంప్ ఆఫీస్‌పై దాడికి ప్రయత్నించారు. దాడి విషయంలో తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున క్యాంప్ ఆఫీస్‌కు చేరుకున్నారు. కానీ వారిని లోపలికి అనుమతి లేదని పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు బీఆర్ఎస్ నేతలకు వాగ్వాదం జరిగింది. ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి కార్యాలయానికి చేరుకొని బీఆర్ఎస్ నేతలతో కలిసి క్యాంపు ఆఫీస్‌లో పగిలిన గ్లాసు డోర్, కిటికీలు, ఇతర సామగ్రిని పరిశీలించారు. బాధ్యులైన వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ శ్రేణులు వందలాదిగా క్యాంపు కార్యాలయానికి తరలిరావడంతో ఒక్కసారిగా పోలీసులు అక్కడికి చేరుకొని ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. గజ్వేల్ ఏసీపీ నర్సింహులుతో వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పడంతో శాంతించారు. క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని పోలీసుల సమక్షంలోనే మిగతా 2లో..




ఇబ్రహీంపట్నం, క్యాతన్‌పల్లి
# మునిసిపల్ పీఠాలు
# బీఆర్ఎస్‌వే

- ముగిసిన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక
- ఖానాపూర్ మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక వాయిదా



**హైదరాబాద్/మంచిర్యాల, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 4:** ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికపై ఉత్కంఠకు తెరపడింది. రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీని బీఆర్ఎస్ పార్టీ దక్కించుకుంది. ఛైర్మన్‌గా టేకుల సుదర్శన్‌రెడ్డిని ఎన్నుకున్నారు. వైస్ ఛైర్‌పర్సన్‌గా బీజేపీ కౌన్సిలర్ ముత్యాల శ్యామల ఎన్నికయ్యారు. ముందుగా ఛైర్‌పర్సన్ ఎన్నిక వేళ అధికారులు బీజేపీ అభ్యర్థి మౌనిక పేరు ప్రతిపాదించారు. మౌనికకు మద్దతుగా ఎనిమిది మంది కౌన్సిలర్లు చేతులెత్తారు. ఎన్నిక తీరుపై ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అభ్యంతరం వ్యక్తం చేశారు. ముందుగా బీజేపీ అభ్యర్థి పేరు ఎలా ప్రతిపాదిస్తారంటూ ఆందోళన చేశారు. అధికారులతో వెడ్మ బొజ్జు వాగ్వాదానికి దిగారు. ఛైర్మన్ ఎన్నికను రేపటికి వాయిదా వేశారు. ఎప్పుడు నిర్వహించాలనే దానిపై సందిగ్ధత నెలకొంది. సమావేశం నుంచి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు బయటకు వెళ్లిపోయారు. మున్సిపల్ కార్యాలయం ముందు బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఆందోళన చేశారు. వెడ్మ బొజ్జుకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ అభ్యర్థికి మెజారిటీ ఉన్నా ఛైర్మన్‌గా ప్రకటించలేదని బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఆందోళన చేశారు.

### క్యాతన్‌పల్లి మునిసిపల్ పీఠం బీఆర్ఎస్‌దే

క్యాతన్‌పల్లి మునిసిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియ ఎట్టకేలకు ముగిసింది. అదనపు కలెక్టర్ చంద్రయ్య, బెల్లంపల్లి సబ్‌కలెక్టర్ మనోజ్‌ల పర్యవేణలో శనివారం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో చేపట్టారు. దీంతో దాదాపు రెండునెలలుగా మునిసిపాలిటీలో నెలకొన్న ఉద్రిక్తతకు తెరపడింది. రాష్ట్రవ్యాప్తంగా ఫిబ్రవరి 11న మునిసిపాలిటీల ఎన్నికలు మిగతా 2లో..



## తారామతి రిసార్ట్స్‌లో డ్రగ్స్ కలకలం

2 లో..

## ఫుట్‌పాత్ ఆక్రమణలపై జీహెచ్ఎంసీ కొరడా

- ఒకేరోజు 798 దుకాణాల తొలగింపు
- జీహెచ్ఎంసీ సిబ్బంది, చిరు వ్యాపారుల మధ్య వాగ్వాదం

2 లో..



సంపుటి: 1 సంచిక: 309 వార్త వేదిక సూర్య || ఆదివారం, 5 ఏప్రిల్, 2026 ||

# బాసరకు రూ.225 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

పనులకు రూ.225 కోట్లు మంజూరు చేశారు. రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల పరిసరాల్లో తిరుమల తరహాలో నిబంధనలు అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాజకీయ పార్టీల సభలు, జెండాలు, ప్రదర్శనలు లేకుండా ఆధ్యాత్మికతకు పెద్దపీట వేయాలని సూచించారు. శనివారం బాసర జ్ఞాన సరస్వతి దేవాలయ అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. దీనిని పరిశీలించిన సీఎం.. పలు మార్పులు సూచించారు. సంప్రదాయాలు, శాస్త్రాలను పరిగణనలోకి తీసుకొని భక్తుల విశ్వాసాలకు పెద్దపీట వేస్తూ బాసర ఆలయ అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. భవిష్యత్ అవసరాలు, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని విశాలమైన రోడ్లు నిర్మించాలన్నారు. ఆలయ ప్రాంగణం భవిష్యత్‌లో భారీ వృక్షాలతో అలరారేలా అవసరమైన మొక్కలు నాటాలని సూచించారు. ఆలయం సమీపంలో హెల్త్ సెంటర్ నిర్మించాలని, పుష్కరాలు, ఇతర ఉత్సవాల రోజుల్లో అక్కడ తగిన సంఖ్యలో వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి భక్తులకు సేవలందించాలని అన్నారు. ఎంతటి ప్రముఖుల వాహనాలైనా ఆలయ ప్రాంగణం బయటే నిలిచిపోవాలని, ప్రాంగణంలోకి కేవలం విద్యుత్ వాహనాల (ఈవీ) ద్వారానే చేరుకునేలా చూడాలని ఆదేశించారు. వాహనాల పార్కింగ్ ప్రదేశంలో సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేయాలన్నారు. అభివృద్ధి పనుల సమయంలో ఆలయ పవిత్రతకు ఎటువంటి భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పనుల నాణ్యతలో రాజీ పడితే సహించేది లేదని సీఎం స్పష్టం చేశారు.

### హైకోర్టు జడ్జిల నివాస సముదాయానికి నేడు



### శంకుస్థాపన

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 4: రాజేందర్‌నగర్‌లో కొత్తగా నిర్మించనున్న హైకోర్టు భవనాల వద్ద జడ్జిల నివాస సముదాయాల కోసం ఆదివారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ శంకుస్థాపన చేయనున్నారు. జోన్ 2 బిల్డింగ్స్ సముదాయ నిర్మాణాల నిమిత్తం ఆదివారం ఉదయం పదిన్నర గంటలకు భూమి పూజ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నర్సింహ, జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎస్‌వీ భట్, జస్టిస్ అలోక్ అరాథే, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్‌సింగ్, ఇతర న్యాయమూర్తులు పాల్గొననున్నారు

# ఇబ్రహీంపట్నం, క్యాతన్‌పల్లి మునిసిపల్ పీఠాలు బీఆర్‌ఎస్‌వే

(మొదటి పేజీ తరువాయి)

జరగగా, 13వ తేదీన ఫలితాలు వెలువడ్డాయి. అన్ని మునిసిపాలిటీలకు 16న చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికలు నిర్వహించగా, క్యాతన్‌పల్లిలో మాత్రం అనూహ్యంగా వాయిదా పడ్డాయి. ఆ రోజు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య నెలకొన్న వివాదం కారణంగా బీఆర్‌ఎస్ సభ్యులు సమయానికి కార్యాలయానికి రాలేదన్న కారణంతో అధికారులు మరుసటి రోజుకు వాయిదా వేశారు. ఫిబ్రవరి 17వ తేదీన రెండు పార్టీలకు చెందిన కౌన్సిల్ సభ్యులు సకాలంలో హాజరైనప్పటికీ పీఠం కైవసం చేసుకోవడం కోసం ఇరు పార్టీలు పట్టుదలకు పోవడంతో కార్యాలయం లోపల నెలకొన్న ఉద్రిక్తతల నడుమ ఎన్నికలు నిర్వహించలేమని పేర్కొంటూ మళ్లీ వాయిదా వేశారు. ఎన్నికల్లో తమకు పూర్తి మెజార్టీ ఉన్నప్పటికీ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికను కాంగ్రెస్ నాయకులు అడ్డుకుంటు న్నారని పేర్కొంటూ బీఆర్‌ఎస్, సీపీఐ కూటమి సభ్యులు హై కోర్టును ఆశ్రయించారు. దీంతో మూడు వారాల్లోగా ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించడంతో దాదాపు రెండు నెలల అనంతరం ఎట్టకేలకు మార్గం సుగమం అయింది. క్యాతన్‌పల్లి మునిసిపాలిటీలో అనేక మలుపుల మధ్య ఎట్టకేలకు చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియ ముగిసింది. చైర్మపర్సన్ పీఠాన్ని కైవసం చేసుకోవాలని ఎన్నికలు ముగిసినప్పటి నుంచి బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు విశ్వ ప్రయత్నాలు చేశాయి. మునిసిపాలిటీ పరిధిలో మొత్తం 22 వార్డులు ఉండగా బీఆర్‌ఎస్‌కు 10 సీట్లు, మిత్రపక్షమైన సీపీఐకి నాలుగు స్థానాలు లభించాయి. అలాగే కాంగ్రెస్‌కు ఏడు సీట్లు రాగా, స్వతంత్రుల్లో ఒకరు ఆ పార్టీకి మద్దతు తెలపడంతో అధికార పార్టీ సభ్యుల సంఖ్య ఎనిమిదికి చేరింది. బీఆర్‌ఎస్, సీపీఐ కూటమికి మ్యాజిక్ ఫిగర్‌కు అవసరమైన మెజారిటీ ఉన్నప్పటికీ చైర్‌పర్సన్ పీఠాన్ని ఎలాగైనా కైవసం చేసుకోవాలనే ఉద్దేశంతో మంత్రి గడ్డం వివేకానంద పావులు కదిపారు. ఒక దశలో సీపీఐ నుంచి గెలుపొందిన నలుగురు సభ్యులను తమవైపు తిప్పుకోవడం కోసం విశ్వప్రయత్నాలు చేశారు. పరిస్థితిని అంచనా వేసిన మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ ఫలితాలు వెలువడిన రోజే ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కూటమి సభ్యులను క్యాంపు కోసం ఖమ్మం జిల్లాకు తరలించారు. తిరిగి చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికను పురస్కరించుకొని ఫిబ్రవరి 16న తన కూటమి సభ్యులను క్యాంపు నుంచి నేరుగా మునిసిపల్ కార్యాలయానికి తరలించారు. కౌన్సిల్ సభ్యుల ప్రమాణ స్వీకారం పూర్తయినప్పటికీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక వాయిదా పడింది.

### ఖానాపూర్ మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక వాయిదా

మరోవైపు ఖానాపూర్ ఛైర్మన్ ఎన్నిక నేపథ్యంలో కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చేతులు ఎత్తే క్రమంలో కౌన్సిలర్ల మధ్య వివాదం నెలకొంది. అధికారులతో ఎమ్మెల్యే, కాంగ్రెస్ కౌన్సిలర్లు వాగ్వాదానికి దిగారు. దీంతో ఛైర్మన్ ఎన్నిక గందరగోళం మధ్య వాయిదా పడింది.



# దేశంలో ఉగ్ర దాడులకు కుట్ర

- యూపీలో ఓ ముఠా అరెస్ట్

న్యూఢిల్లీ: దేశంలోని పలు ప్రాంతాల్లో దాడులకు కుట్ర పన్నిన ఉగ్ర ముఠాను ఉత్తరప్రదేశ్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్‌ఐతో ఈ ముఠాకు సంబంధాలు ఉన్నట్టు గుర్తించారు. లక్నో, ఘజియాబాద్..తదితర ప్రాంతాల్లో రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగించిపెద్ద ఎత్తున దాడులు చేసేందుకు ఈ ముఠా ప్లాన్ చేస్తున్నట్టు తెలిసింది. విదేశాల నుంచి నిధులు పొందుతున్న ఓ సంస్థ వీరికి సహకరిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. లక్నో రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే సిగ్నల్ బాక్స్‌ను లక్ష్యం చేసుకోవడానికి మీరట్‌కు చెందిన సాకిబ్, మరో ముగ్గురు ప్రయత్నిస్తుండగా వారిని కస్టడీలోకి తీసుకున్నట్టు అధికారులు వెల్లడించారు.



# నిత్యావసరాల నౌకలకు అనుమతి

టెహ్రాన్: హార్ముజ్ జల సంధి గుండా తమ దేశ ఓడరేవులకు నిత్యావసర వస్తువులను తీసుకువెళ్లే నౌకల రాకపోకలకు ఇరాన్ అనుమతి ఇచ్చినట్లు శనివారం ఆ దేశ వార్తా సంస్థ తస్నిమ్ తెలిపింది. ప్రస్తుతం ఒమన్ గల్ఫ్‌లో ఉన్న నౌకలతో సహా ఇరాన్ ఓడరేవులకు వెళ్లే నౌకలు ఈ జలసంధి గుండా ప్రయాణించడానికి అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆ వార్తాసంస్థ తెలిపింది. ఇటీవల ప్రపంచవ్యాప్తంగా ఎదురైన ఒడిదుడుకుల నుంచి భారత్ దృఢంగా బయటపడిందని మన విదేశాంగ మంత్రి జైశంకర్ అన్నారు. అమెరికా-ఇజ్రాయెల్ దాడులకు ఇరాన్ ప్రతీకార చర్యలకు వ్యతిరేకంగా ఇటలీ అందిస్తున్న సహాయం గురించి ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ సౌదీ అరేబియా ప్రధాని సల్మాన్‌తో చర్చించారు.






# ప్రజాస్వామ్య జయకేతనం..

- క్యాతనపల్లి, ఇబ్రహీంపట్నంలో విజయంపై కేటీఆర్ హర్షం
- కాంగ్రెస్ అరాచకాలను ఓడించిన ప్రజాస్వామ్యం
- క్యాతనపల్లి, ఇబ్రహీంపట్నంలో విజయంపై కేటీఆర్ హర్షం



హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 4: మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలి టీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సాధించిన విజయాలపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షంవ్యక్తంచేశారు. కాంగ్రె స్ అరాచకాలను ప్రజాస్వామ్యం ఓడించిందని శనివారం ఎక్స్ వేదికగా వ్యాఖ్యానించారు. బీ ఆర్ఎస్ సాధించిన ఘన విజయాన్ని ప్రజాస్వామ్య జయకేతనంగా అభివర్ణించారు. నూతన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లుగా ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలిపారు. గెలుపు కోసం అహర్నిశలు కృషిచేసిన మంచిర్యాల, రంగారెడ్డి జిల్లాల పార్టీ అధ్యక్షులు బాల్క సు మన్, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, యువ నేత మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్(బంటి)తో పాటు అవిశ్రాంతంగా శ్రమించిన గులాబీ శ్రేణులకు ప్ర త్యేక అభినందనలు తెలిపారు. ఈ ఎన్నికల ఫలితాల స్ఫూర్తితో ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అధికారపార్టీ ప్రలోభాలు, ఒత్తిళ్లకు లొంగకుండా ఒక్కతాటి పై ఉన్న కౌన్సిలర్ల ధైర్యానికి కేటీఆర్ సెల్యూట్ చేశారు. తెలంగాణలో అణచివేతలు, బెదిరింపులు, అవినీతి, అక్రమాలకు తావులేదని ఈ తీర్పు స్పష్టంగా తేల్చి చెప్పిందని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ స ర్కార్‌పై ఉన్న ప్రజా వ్యతిరేకతకు అద్దంపట్టాయని కేటీఆర్ తెలిపారు. రెండున్నరేండ్ల పాలనలో పీకల్లోతు అక్రమాల్లో కూరుకొనిపోయిన కాంగ్రెస్‌కు ప్రజాక్షేత్రంలో కౌంట్‌డౌన్ మొదలైందని స్పష్టంచేశారు.

## ఇక ప్రళయానికి 48 గంటలే..

(మొదటి పేజీ తరువాయి)

రక్షించామని, మరొకరి కోసం గాలింపు కొనసాగుతున్నదని అమెరికా, ఇజ్రాయెల్ అధికారిక వర్గాలు తెలిపాయి. అటు హర్మూజ్ సమీపంలో ఏ-10 వార్‌థగ్ ఫైటర్ జెట్‌ను ఇరాన్ కూల్చేసింది. ఆ ఫైటర్ జెట్ శకలాలు కువైట్‌లో పడ్డాయి. అందులోని పైలట్ సురక్షితంగా బయటపడ్డారు. ఈ రెండు ఘటనలు దాదాపు ఒకే సమయంలో జరిగినట్లు అమెరికా అధికారులు చెప్పారు. ఇరాన్ గగనతల రక్షణ సామర్థ్యాన్ని ధ్వంసం చేశామని అమెరికా, ఇజ్రాయెల్ చెబుతున్న సందర్భంగా ఈ ఘటనలు చర్చనీయాంశమయ్యాయి. అమెరికా అంచనాలకు మించి టెహ్రాన్ గగనతల రక్షణ వ్యవస్థలు పనిచేస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. మొదటి యుద్ధ విమానంలో గల్లంతైన పైలట్ కోసం రెండు బ్లాక్‌హాక్ హెలికాప్టర్లు గాలింపు చేపట్టాయి. వాటిపైనా ఇరాన్ దాడి చేసినట్లు అమెరికా అధికారిక వర్గాలు తెలిపాయి. అయితే అవి దాడి నుంచి త్రుటిలో తప్పించుకొని ఇరాన్ గగనతలం నుంచి బయటకు వచ్చేసినట్లు పేర్కొన్నాయి. ఈ ఘటనలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు సమాచారం ఇచ్చినట్లు వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లివిట్ తెలిపారు. ఏ-10 యుద్ధ విమానం కూలిన దృశ్యాలను ముంబైలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ ఎక్స్‌లో పెట్టింది. ఈ పరిణామాలపై అమెరికా ట్రంప్ స్పందించారు. ఇలాంటి ఘటనలు దౌత్య చర్చలపై ప్రభావం చూపిస్తాయా..? అని అడగ్గా.. అలా ఎప్పటికీ జరగదని, ఇది యుద్ధమని, యుద్ధంలో తాము ఉన్నామని, అలాగని ఇవి ఇరాన్‌తో చర్చలపై ప్రభావం చూపించవని సమాధానమిచ్చారు.

## ఘోర రోడ్డు ప్రమాదం..

(మొదటి పేజీ తరువాయి)

శుభకార్యానికి హాజరై తిరిగి తమ స్వగ్రామానికి వెళ్తుండగా వారిని మృత్యువు కబలించింది. వివరాల్లోకి వెళ్తే.. నాసిక్ జిల్లాలోని డిండోరీ ప్రాంతానికి చెందిన సునీల్ దత్తాత్రేయ దర్గుడే (34).. తన భార్య రేష్మా దర్గుడే (30), కుమార్తె రాఖీ అలియాస్ గుణవతి దర్గుడే, వదిన ఆశా దర్గుడే (32), ఆమె కుమారుడు శ్రేయాస్ దర్గుడే, కుమార్తె శ్రిష్టి దర్గుడేతో కలిసి కారులో శివాజీనగర్‌లో శుక్రవారం రాత్రి జరిగిన ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. వేసవి సెలవులు కావడంతో.. ఫంక్షన్ అనంతరం రేష్మా దర్గుడే మేరకోడళ్లు మాధురి, శ్రావణి.. అశా దర్గుడే మేన కోడలు సమృద్ధి కూడా వారితో ఇండోర్ గ్రామానికి బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో డిండోరీ తాలూకా కేంద్రంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఓ బావిలోకి దూసుకెళ్లింది. అది గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్స్ సహాయక చర్యలు చేపట్టారు. క్రేన్ సాయంతో కారును బయటికి తీశారు. ఆ కారులో 8 మృతదేహాలు ఉన్నాయి. కారు నుంచి బయటపడిన మరో బాలిక మృతదేహాన్ని గజ ఈతగాళ్లు వెతికి వెలికి తీశారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికిగల కారణాలపై ఆరా తీస్తున్నట్లు తెలిపారు. ప్రమాద సమయంలో సునీల్ దత్తాత్రేయ దర్గుడే కారు నడుపుతున్నట్లు తమ ప్రాథమిక దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు. కాగా ఈ ప్రమాదంలో మరణించిన ఆరుగురు పిల్లలు 7 నుంచి 14 ఏళ్ల మధ్య వయసు వారేని తెలిపారు. ఆ ఆరుగురిలో ఒకరు బాలుడు, ఐదుగురు బాలికలు ఉన్నట్లు చెప్పారు.

## కేసీఆర్ క్యాంప్ ఆఫీస్‌పై దాడి

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్‌ఎస్ నాయకులు తొలగించారు. అనంతరం క్యాంపు కార్యాలయం నుంచి బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఫిర్యాదు చేశారు.

### సోమవారం గజ్వేల్ బంద్‌కు పిలుపు

గజ్వేల్‌లో కేసీఆర్ క్యాంపు ఆఫీస్‌పై కాంగ్రెస్ మూకలు చేసిన దాడికి నిరసనగా సోమవారం గజ్వేల్ పట్టణ బంద్‌కు బీఆర్‌ఎస్ పిలుపునిచ్చింది. నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు.

## తారామతి రిసార్ట్స్‌లో డ్రగ్స్ కలకలం

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 4: డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'ఈగల్' టీమ్ దూకుడుగా వ్యవహరిస్తోంది. హైదరాబాద్‌లోని గోల్కొండ ప్రాంతంలో పేరొందిన తారామతి రిసార్ట్స్‌లో శనివారం రాత్రి ఈగల్ బృందం దాడి చేసింది. 'జాక్ జాన్సన్' పేరిట రిసార్ట్‌లో జరుగుతున్న ఈవెంట్‌లో డ్రగ్స్ వినియోగంపై అందిన సమాచారంతో రంగంలోకి దిగింది. సినిమాలో నటించే పలువురు జూనియర్ ఆర్టిస్టులు ఈ ఈవెంట్‌కు హాజరైనట్టు తెలిసింది. అయితే, రిసార్ట్‌లో ఉన్నవారిలో 36 మందికి ఈగల్ బృందాలు పరీక్షలు చేయగా వారిలో ఓ మహిళ సహా ఆరుగురికి డ్రగ్స్ పాజిటివ్ అని తేలినట్టు సమాచారం. రిసార్ట్‌లో సోదాలు కొనసాగుతున్నాయి.

## ఫుట్‌పాత్ ఆక్రమణలపై జీహెచ్‌ఎంసీ కొరడా

జీహెచ్‌ఎంసీ సిబ్బంది, చిరు వ్యాపారుల మధ్య వాగ్వాదం

హైదరాబాద్‌లో ఫుట్‌పాత్ ఆక్రమణలపై జీహెచ్‌ఎంసీ కొరడా ఝులిపించింది. 6 జోన్లలో ఫుట్‌పాత్‌ను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు, షెడ్లను తొలగించింది. జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా ఆక్రమణల తొలగింపును చేపట్టారు. ట్రాఫిక్ సమస్యలు, వాహనదారుల ఇబ్బందుల్ని దృష్టిలో ఉంచుకొని కూల్చివేశారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశాలతో స్థానిక ట్రాఫిక్ పోలీసుల సహకారంతో క్షేత్ర స్థాయి సిబ్బంది ఆక్రమణలను తొలగించింది. కమిషనర్ ఆర్వీ కర్ణన్ పర్యవేక్షణ : హైదరాబాద్ నగరంలో పుట్ పాత్ ఆక్రమణలపై జీహెచ్‌ఎంసీ బుల్డోజర్లతో విరుచుకుపడింది. ఆరు జోన్లలోని ప్రధాన వీధుల్లో పుత్ పాత్‌లను ఆక్రమించి నిర్మించిన షెడ్లను, దుకాణాలను నేలమట్టం చేసింది. శంషాబాద్ సర్కిల్-18లో రాళ్లగూడ రోడ్ నుంచి బస్టాండ్ వరకు, ఛార్మినార్ జోన్ లోని లాడ్ బజార్ నుంచి పురానాపూల్ రోడ్, రికబ్ గంజి రోడ్డు వరకు ఆక్రమణలు తొలగించారు. రాజేంద్రనగర్ సర్కిల్‌లోని పిల్లర్ నెంబర్ 252 నుంచి 116 వరకు ఇరువైపుల ఉన్న దుకాణ సముదాయాలను తొలగించారు. రాజేంద్రనగర్ జోన్‌లోని అత్తాపూర్‌తో పాటు గోల్కొండ జోన్‌లో గోషామహల్ సర్కిల్‌లో జంబాగ్ హనుమాన్ దేవాలయం నుంచి ఎంజే మార్కెట్ వరకు ఆక్రమణలు నేలమట్టం చేశారు. సిద్దంబర్ బజార్, అఫ్జల్ గంజ్‌లో రహదారిని ఆక్రమించిన చిరు వ్యాపారుల షెడ్లను కూల్చివేశారు. అధికారులతో కలిసి కమిషనర్ ఆర్వీ కర్ణన్ క్షేత్రస్థాయిలో తిరుగుతూ పరిస్థితిని సమీక్షించారు.



# సర్కారీ బడిలో 'డిజిటల్' వెలుగులు

**పద్మశాలపురం పాఠశాలకు స్మార్ట్ బోర్డు, కంప్యూటర్ల విరాళం**

**ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వరంలా మారిన లెర్నింగ్ లింక్స్, హెచ్ పి సంస్థల చేయూత**

**అత్యాధునిక ఐఎఫ్పీ ప్యానెల్, సాఫ్ట్‌వేర్ అందజేత**

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 04 ( వార్త వేదిక సూర్య ) :



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు అత్యాధునిక సాంకేతిక విద్యను అందించడమే లక్ష్యంగా "లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్" మరియు "హెచ్ పి టెక్నాలజీస్" సంస్థలు ముందడుగు వేశాయి. పద్మశాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా భారీ విరాళాన్ని అందజేసి తమ ఉదారతను చాటుకున్నాయి. పాఠశాలలో స్మార్ట్ క్లాస్ ఐఎఫ్ బి నిర్వహణ కోసం అత్యాధునిక స్మార్ట్ బోర్డుతో పాటు ఒక కంప్యూటర్, మరియు ఒక ప్రింటర్‌ను సంస్థ ప్రతినిధులు శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. కేవలం పరికరాలనే కాకుండా, విద్యార్థులకు పాఠ్యాంశాలను దృశ్య-శ్రవణ రూపంలో (విసుల్ లెర్నింగ్) సులభంగా బోధించడానికి వీలుగా ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్‌ను కూడా ఈ సందర్భంగా ఇన్స్టాల్ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. రవి మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాణించేందుకు ఈ డిజిటల్ పరికరాలు ఎంతగానో దోహదపడ తాయన్నారు. మారుమూల ప్రాంతాల్లోని విద్యార్థులపై మమకా రంతో ఈ సాంకేతిక సహాయాన్ని అందించిన లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ మరియు హెచ్ పి టెక్నాలజీస్ యాజమాన్యానికి ఆయన హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. డిజిటల్ పాఠాల ద్వారా విద్యార్థుల్లో నేర్చుకోవాలనే జిజ్ఞాస పెరుగుతుందని ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎండల ఎఫెక్ట్ పెరుగుతోంది

**- ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మీ చేతుల్లోనే**

**చిన్న జాగ్రత్తలు ప్రాణాలను కాపాడతాయి --**

**డాక్టర్ గద్దె చేతన్**

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 04 ( వార్త వేదిక సూర్య ) :



వేసవి ఎండలు రోజురోజుకు తీవ్రమవుతున్న ఈ సమయంలో, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అత్యంత ముఖ్యమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వడదెబ్బ, నిర్జలీకరణం వంటి ప్రమాదాలు మన నిర్లక్ష్యంతోనే ఎక్కువగా జరుగుతాయని, చిన్న చిన్న జాగ్రత్తలతో పెద్ద ప్రమాదాలను దూరం చేయవచ్చని డాక్టర్ గద్దె చేతన్ తెలిపారు.మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది అనే భావనతో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే ఎండల ప్రభావాన్ని సులభంగా తగ్గించవచ్చని ఆయన సూచించారు.ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా గొడుగు, టోపీ, సన్ గ్లాసెస్ ఉపయోగించాలి. లేత రంగు కాటన్ దుస్తులు ధరించడం ద్వారా శరీరాన్ని చల్లగా ఉంచుకోవచ్చు. ఇది కేవలం అలవాటు కాదు -- ఆరోగ్యాన్ని కాపాడే రక్షణ కవచం అని గుర్తుంచు కోవాలి.దాహం వేసిన తర్వాత కాదు, ముందుగానే నీరు తాగడం జీవన విధానంగా మార్చుకోవాలి. ప్రతి గంటకు నీరు, కొబ్బరి నీళ్లు లేదా మజ్జిగ తీసుకోవడం ద్వారా మన శరీరానికి అవసరమైన శక్తి, తేమను అందించవచ్చు. నీరు అంటే జీవం అనే నిజాన్ని ఈ వేసవిలో మరింతగా గుర్తుంచుకోవాలి.ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఈ సమయాల్లో బయటకు వెళ్లకుండా ఉండటం మీ ఆరోగ్యానికి మీరు ఇచ్చే గొప్ప బహుమతి. అవసరం ఉంటే మాత్రమే బయటకు వెళ్లాలి.పిల్లలు, వృద్ధులు మన కుటుంబానికి బలం. వారిని కాపాడటం మన బాధ్యత. వారికి తరచూ ద్రవాలు ఇవ్వడం, చల్లని ప్రదేశాల్లో ఉంచడం ద్వారా వారిని రక్షించవచ్చు. ప్రకృతి మనకు ఇచ్చిన పండ్ల రసాలు కూడా ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

# ఏప్రిల్ 'ఫూల్స్' నెల కాదు.. ఇది సామాజిక విప్లవకారుల 'జ్ఞాన' మాసం





ప్రతి ఏటా ఏప్రిల్ నెల రాగానే 'ఏప్రిల్ ఫూల్' అంటూ ఒకరినొకరు మోసం చేసుకోవడం, వెక్కిరించుకోవడం ఒక అశాస్త్రీయ ఆచారంగా మారిపోయింది. కానీ, చరిత్రను లోతుగా పరిశీలిస్తే.. ఈ ఏప్రిల్ నెల భారతదేశ సామాజిక ముఖచిత్రాన్ని మార్చిన మహోన్నత వ్యక్తుల జన్మదినాలతో పునీతమైంది. మూఢనమ్మకాల చీకట్లను చీల్చి, అణగారిన వర్గాల జీవితాల్లో విజ్ఞానపు వెలుగులు నింపిన మహనీయులు పుట్టిన ఈ నెలను మనం 'సామాజిక చైతన్య మాసం'గా జరుపుకోవాలి.

**ఏప్రియల్ నెలలోని సామాజిక విప్లవమూర్తులు**

**1. బాబు జగ్‌జీవన్ రామ్ జయంతి (ఏప్రిల్ 5)**

అట్టడుగు వర్గాల నుండి ఎదిగి, దేశ రక్షణ మరియు వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ధీశాలి బాబూజీ. కుల వివక్షను ఎదిరించి, సమసమాజ స్థాపన కోసం ఆయన చేసిన కృషి నేటికీ ఆదర్శం.

**2. మహాత్మా జ్యోతిరావు ఫూలే జయంతి (ఏప్రిల్ 11)**

భారతదేశంలో సామాజిక విప్లవానికి ఆద్యుడు జ్యోతిరావు ఫూలే. అంటరానితనం, మూఢాచారాలపై ఆయన చేసిన పోరాటం నిరుపమానం. "విద్య లేనివాడు వివేకం కోల్పోతాడు" అని చాటిచెప్పిన ఆయన, స్త్రీ విద్య కోసం మొట్టమొదటి పాఠశాలను ప్రారంభించిన యుగపురుషుడు.

**3. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి (ఏప్రిల్ 14)**

భారత రాజ్యాంగ నిర్మాత, ఆధునిక భారత నిర్మాణ శిల్పి బాబాసాహెబ్ అంబేద్కర్ జన్మించింది కూడా ఈ నెలలోనే. జ్ఞానానికి నిలువెత్తు రూపమైన ఆయన, కోట్లాది మంది జీవితాల్లో ఆత్మగౌరవాన్ని నింపారు. "బోధించు, సమీకరించు, పోరాడు" అనే నినాదం నేటికీ హేతువాద ఉద్యమాలకు ఊపిరి.

**మనం మార్చుకోవాల్సిన దృక్పథం**

ఒకవైపు ఇంతటి మహనీయుల స్ఫూర్తి ఉంటే, మరోవైపు సమాజం ఏప్రిల్ 1ని అజ్ఞానంతో 'ఫూల్స్ డే'గా జరుపుకోవడం విచారకరం. మూఢనమ్మకాల నిర్మూలన సంఘం కార్యకర్తలుగా మన బాధ్యత ఏంటంటే.. ప్రజల్లో ఈ అశాస్త్రీయ భావజాలాన్ని తొలగించడం. ఏప్రిల్ నెలను అజ్ఞానానికి ప్రతీకగా కాకుండా, అంబేద్కరిజం, ఫూలే ఆశయాల సాక్షిగా 'విజ్ఞాన మాసం'గా గుర్తించాలి.

**ఏప్రియల్ మాసం అంటే జ్ఞాన మాసం అని గుర్తించుకుంధాం**

మహనీయులు మనకు అందించిన అతిపెద్ద ఆయుధం 'శాస్త్రీయ దృక్పథం'. ఈ ఏప్రిల్ నెలలో వారిని స్మరించుకుంటూ.. సమాజంలో పేరుకుపోయిన కులతత్వం, మతతత్వం, మూఢనమ్మకాలను పారద్రోలి, ఒక సమ సమాజాన్ని నిర్మించడానికి మనమంతా కంకణం కట్టుకుందాం. అప్పుడే ఈ నెలకు, ఆ మహనీయుల జన్మదినాలకు నిజమైన సార్థకత లభిస్తుంది.

గుర్రాల నాగరాజు
జర్నలిస్ట్
(MA,PGDJ)
మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం (ఏం ఎన్ ఎస్)
తెలంగాణ రాష్ట్ర యూత్ జాయింట్ సెక్రటరీ
యాదాద్రి భువనగిరి జిల్లా
95731 88975



# అణగారిన వర్గాల ధ్రువతార 'బాబూజీ'



భారతదేశ సామాజిక విప్లవ చరిత్రలో బాబు జగ్‌జీవన్ రామ్ ఒక అచంచలమైన శక్తి. 1908 ఏప్రిల్ 5న బీహార్‌లోని ఒక సాధారణ దళిత కుటుంబంలో జన్మించి, దేశ ఉప ప్రధాన మంత్రి స్థాయికి ఎదిగిన ఆయన ప్రస్థానం ఒక అద్భుతం. అంటరానితనం అనే సామాజిక క్యాన్సర్‌ను రూపుమాపడానికి ఆయన తన జీవితాంతం పోరాడారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, పార్లమెంటేరియన్‌గా, రక్షణ మరియు వ్యవసాయ శాఖ మంత్రిగా ఆయన ముద్ర చెరపలేనిది.

**వివక్షపై హేతుబద్ధ పోరాటం**

జగ్‌జీవన్ రామ్ కేవలం భావోద్వేగాలతో కాకుండా, హేతుబద్ధమైన ఆలోచనలతో వివక్షను ఎదిరించారు. వారణాసిలో చదువుకునే రోజుల్లో ఆయనకు ప్రత్యేకమైన మంచినీటి కుండను ఏర్పాటు చేసినప్పుడు, దానిని పగులగొట్టి "మనుషుల మధ్య వివక్ష చూపే ఏ ఆచారం అయినా అది అశాస్త్రీయమైనది" అని చాటిచెప్పారు. ఇది నేటి 'మూఢనమ్మకాల నిర్మూలన సంఘం' కార్యకర్తలకు ఒక గొప్ప పాఠం. అశాస్త్రీయ ఆచారాలను మౌనంగా భరించడం కంటే, వాటిని తార్కికంగా ఎదిరించడమే నిజమైన సామాజిక బాధ్యత అని ఆయన నిరూపించారు.

**హరిజన సేవా సంఘం నుండి పార్లమెంట్ వరకు**

1935లో 'ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్' స్థాపించి, దళితుల హక్కుల కోసం సంస్థాగత పోరాటం ప్రారంభించారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లారు. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ క్యాబినెట్‌లో అతిపిన్న వయస్కుడైన మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. వ్యవసాయ మంత్రిగా ఆయన హయాంలోనే భారతదేశం 'హరిత విప్లవం' సాధించి, ఆహార ధాన్యాల దిగుమతి స్థాయి నుండి ఎగుమతి చేసే స్థాయికి ఎదిగింది. 1971 ఇండో-పాక్ యుద్ధ సమయంలో రక్షణ మంత్రిగా ఆయన చూపిన చొరవతోనే బంగ్లాదేశ్ ఆవిర్భవించింది.

**మూఢనమ్మకాలపై యుద్ధం - శాస్త్రీయ దృక్పథం**

నేడు సమాజంలో వేళ్లూనుకుపోయిన కుల వివక్ష, అంటరానితనం వెనుక అనేక మూఢనమ్మకాలు దాగి ఉన్నాయి. "ఒక మనిషిని తాకితే మైల పడతారు" అనే అశాస్త్రీయ భావనను బాబూజీ తీవ్రంగా వ్యతిరేకించారు. ఆయన దృష్టిలో సామాజిక సమానత్వం అంటే కేవలం చట్టాలు చేయడం కాదు, మనుషుల ఆలోచనా విధానంలో మార్పు రావడం. సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న ఈ కాలంలో కూడా, ఇంకా మూఢాచారాల పేరుతో దళితులపై దాడులు జరగడం విచారకరం.

**మన బాధ్యత**

'మూఢనమ్మకాల నిర్మూలన సంఘం' రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నేను పిలుపునిచ్చేది ఏంటంటే.. బాబూజీ ఆశయాలను కేవలం పుస్తకాలకే పరిమితం చేయకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి. కుల రహిత, మతాతీత సమాజం కోసం ఆయన చేసిన కృషిని కొనసాగించాలి. మూఢనమ్మకాలనే అంధకారం నుండి సమాజాన్ని విజ్ఞానం వైపు నడిపించడమే జగ్‌జీవన్ రామ్ కి మనం ఇచ్చే నిజమైన నివాళి.

గుర్రాల నాగరాజు
జర్నలిస్ట్ (MA,PGDJ)
మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం (ఏం ఎన్ ఎస్)
తెలంగాణ రాష్ట్ర యూత్ జాయింట్ సెక్రటరీ
యాదాద్రి భువనగిరి జిల్లా
9573188975



# ఘనంగా శ్రీ రామలింగేశ్వర స్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం...




**స్వామి వారి కరుణాకటాక్షాలు గ్రామ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని గ్రామం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించిన దేవాలయ చైర్మన్ దేప శ్యాంసుందర్ ముదిరాజ్**

చౌటుప్పల్ ( వార్త వేదిక సూర్య )

చౌటుప్పల్ మండలం దండు మల్కాపూర్ గ్రామంలో శ్రీ రామలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం మరియు జాతర సందర్భంగా ధ్వజస్థంభ ప్రతిష్ఠాపన కన్నుల పండుగగా ఘనంగా శనివారం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ దేప శ్యాంసుందర్ ముదిరాజ్ మాట్లాడుతూ ధ్వజస్థంభ దాతగా ముందుకు వచ్చిన నెల్లికంటి హరిప్రసాద్ అలాగే అన్నదాన కార్యక్రమం దాతగా సహకరించిన మాజీ జడ్పీటీసీ సభ్యులు చిలుకూరి ప్రభాకర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు శనివారం నుండి మంగళవారం వరకు జరిగే కల్యాణ మహోత్సవం మరియు జాతర కార్యక్రమలని ఆగంరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుంది కావున గ్రామ ప్రజలు ప్రజా ప్రతినిధులు,అందరూ పాల్గొని ఈ కార్యక్రమాలను విజయవంతం చేయగలరని కోరారు. ఈ వేడుకలో శ్రీ రామలింగేశ్వర దేవాలయం ధర్మకర్తలు దౌడి లింగస్వామి, సిల్వేరు శంకర్ జెరిపోతుల అకిల మహేందర్ ఎల్లంకి లింగచారి,ప్రజా ప్రతినిధులు గ్రామ ప్రజలు గ్రామ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు వేదపండితులు మంత్రోచ్ఛారణ కార్యమన్ని వైభవంగా జరిపించారు



# అభివృద్ధి విషయంలో వెనకడుగువేయం

**కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ ఎంపి - కిషన్ రెడ్డి**

సికింద్రాబాద్, ఏప్రిల్ 04(వార్త వేదిక సూర్య)

అభివృద్ధి విషయంలో బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని కేంద్రమంత్రి సికింద్రాబాద్ ఎంపి కిషన్ రెడ్డి అన్నారు. శనివారం మోండా డివిజన్ లోని సాంబమూర్తి నగర్ కామన్, గ్యాస్మండి పలు చోట్ల నూతనంగా నిర్మించిన సిసి రోడ్ పనులను మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... రానున్న జిహెచ్ఎంసి ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్ తదితరులున్నారు

# శ్రీ గాయత్రి మాతా దేవాలయ అభివృద్ధికి సహకారం అందించాలి: టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ పార్వతల రాజేందర్‌కు విన్నపం

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 04 ( వార్త వేదిక సూర్య ) :





మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని చెల్క బావి వినాయక్ నగర్‌లో వెలసిన శ్రీ గాయత్రి మాతా దేవాలయ కమిటీ ప్రతినిధులు శనివారం టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ పార్వతల రాజేందర్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దేవాలయ అభివృద్ధి పనుల గురించి చర్చించి, దానికి అవసరమైన సహాయ సహకారాలను అందించాలని వారు కోరారు. పార్వతల రాజేందర్ ప్రతినిధుల విన్నపంపై పార్వతల రాజేందర్ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. సమాజంలో ఆధ్యాత్మిక చింతన పెరిగినప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. దేవాలయాల అభివృద్ధిలో తన వంతు తోడ్పాటు ఎల్లప్పుడూ ఉంటుందని, గాయత్రి మాతా దేవాలయ పురోభివృద్ధికి అవసరమైన సహకారాన్ని అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కమిటీ ప్రతినిధులు ఆయనకు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ ప్రధాన కార్యదర్శి ఉమ్మల రామాంజనేయులుతో పాటు బండి చెన్నయ్య, కొవ్వాకుల యాదగిరి, వేముల శివ, వదునాల మహేష్, జాలం ధర్మేందర్, అశోక్, రావుల వెంకటేష్, ఉమ్మల లోకేష్, అజయ్ కుమార్, శ్రీనివాస్, మహేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్‌లో వెల్లువెత్తిన హిందూ చైతన్యం





## ఘనంగా 'హిందూ సమ్మేళనం'.. భారీగా తరలివచ్చిన జనం

## ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల వేళ హిందూ సమాజం ఐక్యం కావాలి: విశ్వనాథ్ శర్మ

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 04 ( వార్త వేదిక సూర్య ) :

రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని హైదర్‌గూడలో శనివారం హిందూ చైతన్యం వెల్లువెత్తింది. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ స్థాపితమై 100 సంవత్సరాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకుని నిర్వహించిన 'హిందూ సమ్మేళనం' అత్యంత వైభవంగా జరిగింది. హైదర్‌గూడ గాంధీ విగ్రహం సమీపంలో జరిగిన ఈ భారీ బహిరంగ సభకు హిందూ బంధువులు వేలాదిగా తరలివచ్చారు. గడప లోపల కులం - గడప దాటితే హిందువులం" అనే నినాదంతో సాగిన ఈ కార్యక్రమంలో వక్తలు హిందూ సమాజ ఐక్యతను చాటి చెప్పారు. ఆర్ఎస్ఎస్ తెలంగాణ సహ ప్రాంత కార్యవాహ ఉప్పలంచ మల్లికార్జున్ మాట్లాడుతూ.. హిందూ ధర్మ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ప్రముఖ హైకోర్టు న్యాయవాది మోనిక సుంకర మాట్లాడుతూ.. హిందువుగా జీవించు - హిందువునని గర్వించు" అనే భావన ప్రతి ఇంట్లోనూ పెంపొందాలని అన్నారు. మరో ముఖ్య అతిథి ఎం. విశ్వనాథ్ శర్మ, సంఘ్ ఆశయాలను వివరించారు. ఈ సమ్మేళనానికి మహిళలు, యువత పెద్ద ఎత్తున హాజరయ్యారు. దాదాపు 1000 మందికి పైగా ప్రజలతో ఆ ప్రాంత మంతా కాషాయమయమైంది. ఈ కార్యక్రమానికి అధ్యక్షుడిగా కోలన్ జైపాల్ రెడ్డి, ఆర్గనైజర్‌గా సిదేశ్వర్ వ్యవహరించారు. వివేకానంద యూత్ అసోసియేషన్, శివాజీ యూత్ అసోసియేషన్, బాబు జగ్జీవన్ రావ్ అసోసియేషన్లతో పాటు పలు కుల సంఘాల ప్రతినిధులు ఈ కార్యక్రమ విజయవంతానికి కృషి చేశారు. హిందూ కుటుంబాలన్నీ స్వచ్ఛందంగా తరలివచ్చి కార్యక్రమాన్ని దిగ్విజయం చేసినట్లు ఉత్సవ సమితి ప్రతినిధులు ఈ సందర్భంగా తెలియజేశారు.





## చలివేంద్రాన్ని ప్రారంభించిన టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ పర్వతాల రాజేందర్

మైలర్ దేవ్ పల్లి ఏప్రిల్, 04 ( వార్త వేదిక సూర్య ) :



వేసవి కాలంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛమైన మంచినీటిని అందించడం అభినందనీయమని టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ పర్వతాల రాజేందర్ అన్నారు. శనివారం జంగమ్మెట్ పరిధిలోని శ్రీ బంగారు మైసమ్మ దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన ఉచిత వేసవి చలివేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. భానుడి భగభగలకు ప్రజలు అల్లాడిపోతున్నారని, ముఖ్యంగా పాదచారులు, కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కోసం దేవాలయ ప్రాంగణంలో ఈ నీటి కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ తమ వంతు సాయంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. వేసవి ముగిసే వరకు ఈ చలివేంద్రం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, దేవాలయ కమిటీ ప్రతినిధులు మరియు భక్తులు పాల్గొన్నారు.




## జోనల్ కమిషనర్ మంగ తయారు ను కలిసిన మాజీ కార్పొరేటర్ డాక్టర్ హేమ సామల

సికింద్రాబాద్ ఏప్రిల్ 04(వార్త వేదిక సూర్య)



సీతాఫల్మండి డివిజన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల ఆలస్యం మరియు పారిశుద్ధ్య సమస్యలపై మాజీ కార్పొరేటర్ డా హేమ సామల శనివారం జోనల్ కమిషనర్ కు లేఖ అందించారు. డివిజన్ పరిధిలో అనేక ముఖ్యమైన అభివృద్ధి పనులు ఇంకా పూర్తి కాలేదని, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నదని ఆమె పేర్కొన్నారు. నవంబర్ 2023లో ఆమె పదవీకాలంలో స్టాండింగ్ కమిటీ ఆమోదంతో భవానీనగర్ నుంచి ఫ్రైడే మార్కెట్ వరకు, అలాగే ఫ్రైడే మార్కెట్ నుంచి మహమ్మద్‌గూడ వరకు నాలా అభివృద్ధి పనులకు సుమారు రూ. 9.5 కోట్ల వ్యయంతో అనుమతి లభించినప్పటికీ, ఇప్పటివరకు పనులు గణనీయంగా పురోగతి సాధించలేదని జోనల్ కమిషనర్ మంగ తయారు కు తెలిపారు. సీతాఫల్మండి గ్రేవీయర్డు అభివృద్ధి పనులకు (చిలకలగూడ డివిజన్) నిధులు మంజూరు చేయాలని కోరారు,ఎరుకల బస్తీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని నామలగుండలో +నవీజ వార్డ్ కార్యాలయ భవనం పూర్తి కొరకు నిధులు మంజూరు అయ్యాయని త్వరగా పనులు చేపట్టి వార్డు కార్యాలయాన్ని అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.సీతాఫల్మండి మరియు చిలకలగూడ ప్రాంతాల్లో రోడ్ల పునరుద్ధరణ పనులు చేపట్టాలని కోరారు ఇక పారిశుద్ధ్య పరంగా కూడా పరిస్థితి ఆందోళనకరంగా ఉందని లేఖలో ఆమె పేర్కొన్నారు. అనంతరం డి సి జ్యోతి గారిని మర్యాదపూర్వకంగా కలిసి డివిజన్ లో పెండింగ్ లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మంగ తయారు, డీసీ జ్యోతి, ఏ ఈ వేణు, బి అర్ ఎస్ నాయకులు కరాటే రాజు తదితరులు పాల్గొన్నారు

# వినాయక నగర్‌లో 'నరకప్రాయం'





## : గుంతలమయమైన రోడ్లతో జనం అవస్థలు

## సాకుల నోటిఫికేషన్లు ఉన్నాయి కానీ.. రోడ్లకు మోక్షం లేదు!

## మైలర్‌దేవ్‌పల్లి వినాయక నగర్ నివాసితుల ఆవేదన

## మూడేళ్ల క్రితం డ్రైనేజీ పనులు.. నేటికీ పూర్తికాని రోడ్లు

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 04 ( వార్త వేదిక సూర్య ) :

అభివృద్ధి అంటే కేవలం మాటలు కాదని, అది క్షేత్రస్థాయిలో కనిపించాలని మైలర్‌దేవ్‌పల్లి డివిజన్, వినాయక నగర్ నివాసితులు డిమాండ్ చేస్తున్నారు. స్థానిక ఎస్సీ కార్పొరేషన్ (కోళ్లఫారం సైడ్) ప్రాంతంలో గత మూడు సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న రోడ్ల సమస్యపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఈ కాలనీలో మూడు సంవత్సరాల క్రితం డ్రైనేజీ పైపులైన్లు వేశారు. పనులు పూర్తయిన వెంటనే రోడ్లు వేస్తారని భావించిన నివాసితులకు నిరాశే ఎదురైంది. తవ్విన రోడ్లను అలాగే వదిలేయడంతో, ప్రస్తుతం ఆ డ్రైనేజీ వ్యవస్థ కూడా శిథిలావస్థకు చేరుతోంది. గుంతలమయమైన రోడ్ల కారణంగా వాహనదారులు, ముఖ్యంగా వృద్ధులు మరియు చిన్నపిల్లలు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. స్థానిక నివాసితులు ఈ విషయమై ప్రజాప్రతినిధులను ప్రశ్నించిన ప్రతిసారీ ఏదో ఒక ఎన్నికల సాకును తెరపైకి తెస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఒకసారి కార్పొరేటర్ ఎన్నికల నోటిఫికేషన్ అంటారు. మరోసారి ఎమ్మెల్యే ఎన్నికల కోడ్ అని చెబుతారు. ఎన్నికల హడావుడి ముగిసినా, కొత్త పాలకులు వచ్చినా ఈ కాలనీ రోడ్ల పరిస్థితిలో మాత్రం మార్పు రావడం లేదు. కేవలం ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వచ్చే నాయకులు, గెలిచిన తర్వాత కనీస మౌలిక సదుపాయాలను పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

నిరంతరం సాకులు చెబుతూ కాలయాపన చేయడం మానుకోవాలని, జీహెచ్‌ఎంసీ అధికారులు మరియు స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించి వినాయక నగర్ ఎస్సీ కార్పొరేషన్ ఏరియాలో నూతన రోడ్ల నిర్మాణాన్ని ప్రారంభించాలని కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మణికొండలో హిందూ సమ్మేళనం ఏర్పాట్లు -- కమిటీ నియామకం



మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 04 ( వార్త వేదిక సూర్య ) :

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది సంవత్సరాన్ని పురస్కరించుకుని మణికొండ గోల్డెన్ టెంపుల్ వెనుక ప్రాంగణంలో 2026 ఏప్రిల్ 19వ తేదీ ఆదివారం సాయంత్రం హిందూ సమ్మేళనం నిర్వహించనున్నట్లు స్థానిక నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు సమావేశమై, కులమతాలకు అతీతంగా హిందువులంతా బంధువులమే అనే భావనను వ్యాప్తి చేయడం, సమ సమాజ నిర్మాణం, సనాతన ధర్మ పరిరక్షణ మరియు ఆధ్యాత్మిక విలువల పెంపొందన లక్ష్యాలుగా నిర్ణయించారు. ఈ సమ్మేళనంలో భక్తి, సంస్కృతి, సామాజిక ఐక్యతపై వివిధ ఉపన్యాసాలు, చర్చలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కోసం కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్‌గా ఇంద్రసేన రెడ్డి, అధ్యక్షునిగా బుద్ధోలు శ్రీరాములు, ఉపాధ్యక్షునిగా అందె లక్ష్మణ్ రావు, ప్రధాన కార్యదర్శిగా గొల్లపల్లి ఫణీంద్రను నియమించారు. కోశాధికారులుగా గాయత్రి, సోమన్ బాధ్యతలు చేపట్టగా, సన్నాహక కార్యాల సహ కార్యదర్శులుగా శైలజ, హేమలత, నరేంద్ర, సురేఖ, బిందు, మెహర్ జ్యోతి, దిలీప్ కక్కడ్ తదితరులను నియమించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి స్థానిక ప్రజలందరూ పాల్గొని సహకరించాలని నిర్వాహకులు

## ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌ను కలిసిన డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ భారతి

సికింద్రాబాద్, ఏప్రిల్ 04(వార్త వేదిక సూర్య)



సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ గారిని సీతాఫలమండి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ భారతి ఆధ్వర్యంలో అధ్యాపకుల బృందం మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను వినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రస్తుతం సీతాఫలమండి డిగ్రీ కళాశాల అకడమిక్ కార్యకలాపాలు విద్యానగర్‌లోని వివేకానంద డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్నాయని తెలిపారు. అయితే అక్కడ తగినంత మౌలిక వసతులు లేకపోవడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ముఖ్యంగా తరగతి గదుల కొరత, సరైన కూర్చోవడానికి సౌకర్యం లేకపోవడం, ప్రయోగశాలలు మరియు ఇతర విద్యా వనరులు అందుబాటులో లేకపోవడం వల్ల బోధన-అభ్యాస ప్రక్రియపై ప్రభావం పడుతోందని చెప్పారు. విద్యార్థుల విద్యాభ్యాసం దెబ్బతినకుండా, వారికి అనుకూలమైన వాతావరణంలో చదువుకునే అవకాశం కల్పించేందుకు, కళాశాలను తగిన సౌకర్యాలు కలిగిన వేరే భవనానికి తక్షణం తరలించేలా చర్యలు తీసుకోవాలని అధ్యాపకుల బృందం ఎమ్మెల్యే విజ్ఞప్తి చేసింది. అధ్యాపకుల విజ్ఞప్తిని విన్న ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ సమస్య తీవ్రతను గుర్తించి, దీనిపై సంబంధిత అధికారులతో చర్చించి వీలైనంత త్వరగా పరిష్కారం కనుగొనేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ డాక్టర్ సామల హేమ మరియు కళాశాల ప్రిన్సిపల్ భారతి, తదితరులు పాల్గొన్నారు

# ఈరోజు తిప్పర్తి మండల కేంద్రంలో దాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన టిఆర్ఎస్ పార్టీ బృందం

నల్గొండ టౌన్ ఏప్రిల్ 4 /వార్తా వేదిక సూర్య/

తిప్పర్తి మండల కేంద్రంలో దాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి మాట్లాడుతున్న తిప్పర్తి మాజీ జెడ్పిటిసి తండు సైదులు గౌడ్ దీ=ా జిల్లా నాయకులు కందుల లక్ష్మయ్య, దీ=ా మాజీ మండల అధ్యక్షులు శిరసవాడ సైదులు,మాట్లాడుతూ వరి ధాన్యం కేంద్రాలకు తీసుకొచ్చి సుమారు నెలరోజులు కావస్తున్న అధికారులు అధికార పార్టీ నాయకులు నిర్లక్ష్యం వల్ల ఇంతవరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభోత్సవం చేయడం లేదుూజా మరియు మహిళా సంఘాల మధ్యన కావాలని పంచాయతీ పెట్టి గత వారం రోజులుగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభోత్సవం కాకుండా అధికార పార్టీ నాయకులు రైతులను ఇబ్బంది పెడుతున్నారు అదేవిధంగా గతంలో ఇప్పటివరకు సుమారు 50 వేల క్వింటాళ్ల ధాన్యం తిప్పార్తి మండలం నుండి సేకరించేది కానీ ఇప్పటివరకు ఒక్క బస్తా కొనుగోలు చేయకపోవడం దారుణమని అన్నారు వీళ్ళు కొనుగోలు చేయకపోవడం కారణంగా రైతులు మిల్లర్ల వద్దకు పోయి ధరలో నష్టపోవడంతో పాటు తూకాలంలో కూడా రైతుల్ని మోసం చేయడం మిల్లర్ల వంతు అవుతుంది మిల్లర్లు అధికార పార్టీ నాయకులు కుమ్మక్కై రైతాంగాన్ని మోసం చేస్తున్నారు అకాల వర్షం వచ్చే ఐకెపి కేంద్రాల్లో ఉన్నటువంటి వరి ధాన్యం మొత్తం తడిసి రైతులకు నష్టం జరిగే అవకాశం ఉంది. ఇప్పటివరకు జిల్లా అధికారులు మిల్లులకు టాకింగ్ చేయలేదు ఏ సెంటర్ కూడా బస్తాలు పంపలేదు మరియు ట్రాన్స్పోర్ట్ కు సంబంధించినటువంటి లారీ ఏజెన్సీ కూడా ఇంతవరకు ఫైనల్



చేయకపోవడం చాలా రైతులను ఇబ్బంది పెట్టడం తప్ప ఇంకొకటి కాదు, రెండు మూడు రోజులలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభోత్సవం చేయకపోతే రైతుల తోటి తిప్పర్తి మండల కేంద్రంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమములో దీ=ా నాయకులు భైరగోని శ్రీనివాస్, గుర్రం వెంకట్ రెడ్డి, వల్లపురెడ్డి వెంకట్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు



## పీపుల్స్ రైట్ టు ఇన్ఫర్మేషన్ కమిటీ రాష్ట్ర లీగల్ అడ్వైజర్ శ్రీ కె.ఎన్ కుమార్

నల్గొండ టౌన్ ఏప్రిల్ 4 /వార్తా వేదిక సూర్య/

( అడ్వకేట్ ) మరియు వ్యవస్థాపక అధ్యక్షులు అభిలాష్ పెరిక గారి సమక్షంలో, నల్గొండ నియోజకవర్గ అధ్యక్షులు కొండ అభినవ్ గారి ఆధ్వర్యంలో పజ్జూర్ గ్రామానికి చెందిన పెరపాక శ్రవణ్ తిప్పర్తి మండల అధ్యక్షులుగా ఎన్నికయ్యారు ఈ సమావేశంలో శ్రవణ్ మాట్లాడుతూ సంస్థ యొక్క అభివృద్ధి మరియు ప్రజలకు మెరుగైన సేవలను అందించడానికి కృషి చేస్తానని తెలిపారు

## నకిరేకల్ పట్టణంలోని శ్రీ శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కందాల సత్తిరెడ్డి





నల్గొండ టౌన్ ఏప్రిల్ 4 /వార్తవేదిక సూర్య/

నకిరేకల్ పట్టణంలోని శ్రీ శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కందాల సత్తిరెడ్డి మరియు డైరెక్టర్ల ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నూతన కమిటీకి ఆయన శుభాకాంక్షలు తెలియజేసి, ఆలయ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని సూచించారు.

## కొల్లా నాగరత్నమ్మ కు పూలమాలవేసి, నివాళులర్పించి న ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 4 (వార్తా వేదిక సూర్య )



చిట్యాల పట్టణానికి చెందిన కొల్లా నాగరత్నమ్మ శుక్రవారం అనారోగ్యంతో మరణించగా వారి చిత్రపటానికి ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పూలమాలవేసి, నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇక సులువు

### నల్లగొండ లో అంబటి శ్రీనివాస్ ఇన్స్టిట్యూట్ ఘన ప్రారంభం

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 4 (వార్తా వేదిక సూర్య )



నల్లగొండ పట్టణం లోని ఎల్ పి టి మార్కెట్ లో 2 వ లైన్ 2 వ అంతస్తు లో షాప్ నెంబర్ 33 లో నూతనంగా ప్రారంభమైన అంబటి శ్రీనివాస్ స్పోకెన్ ఇంగ్లీషు ఇన్స్టిట్యూట్ ప్రారంభోత్సవ వేడుక శని వారం అత్యంత వైభవంగా జరిగింది. విద్యార్థులు,ఉద్యోగర్థులు, గృహిణిలు, యువత పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవతం చేశారు. ఇంగ్లీష్ మాట్లాడటం ఇక కష్టం కాదు. సరైన శిక్షణ తో చాలా సులువు అనే సందేశం తో ఇన్స్టిట్యూట్ ప్రారంభమైంది. ఈ సంస్థ వ్యవస్థాపకుడు అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ..గత పది సంవత్సరాల అనుభవం తో వేలాది మంది విద్యార్థులకు సులభమైన పద్ధతుల్లో ఇంగ్లీష్ నేర్పించి వారి జీవితాల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంచినట్లు ఆయన తెలిపారు. అడ్మిషన్ల కోసం సెల్ నంబర్ 8500242157 కు సంప్రదించాలని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని నల్లగొండ వాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## నేరరహిత సమాజానికి ప్రతి ఒక్క పౌరుడు బాధ్యతాయుతంగా పనిచేయాలి

### -నల్లగొండ డీఎస్పీ శివరామిరెడ్డి

నల్గొండ టౌన్ ఏప్రిల్ 4 /వార్త వేదిక సూర్య/

ఈరోజు తిప్పర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని గ్రామ పౌరులను ఉద్దేశించి మాట్లాడారు. నేర రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని ప్రతి ఒక్క పౌరుడు బాధగాయతంగా ఉండి డ్రగ్స్ మరియు మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా సమాజం పట్ల బాధ్యతగా నడుచుకోవాలని పేర్కొన్నారు సీసీ కెమెరాలు ఏర్పాటుకై తన వంతుగా తిప్పర్తి ఏడో వార్డు సభ్యుడైన తుమ్మల నాగరాజు పదివేల రూపాయలు సహాయం చేశారు ఈ సందర్భంగా వారిని అభినందించి శాలువాతో సత్కరించారు.

గ్రామాల్లో ఉన్న వ్యాపారాలు మరియు బాధ్యత కలిగిన పౌరులు తమ వంతుగా విరాళం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ముత్తినేని శ్యాంసుందర్, స్థానిక సర్పంచ్ బద్దం రజిత సుదీర్, ఉప సర్పంచ్ నూకల దేవకమ్మ సైదులు, శాలిగౌరారం వలయాధికారి కొండల్ రెడ్డి ,స్థానిక ఎస్సై వి .శంకర్ ,మాజీ ఎంపిటిసి పల్లె ఎల్లయ్య ,వార్డు మెంబర్లు, శివకృష్ణ ,రావుల



సందీప్ ,బైరు జానయ్య గ్రామ యువకులు ,పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలగిరి సాగర్ మండలంలో పెండింగ్ భూముల సమస్యలపై సమీక్ష సమావేశం

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 4 (వార్తా వేదిక సూర్య )



నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని తిరుమల గిరి సాగర్ మండలంలో పెండింగ్ లో ఉన్న ఫారెస్టు భూములకు త్వరితగతిన డి -ఫామ్ పట్టాలు ఇవ్వాలని నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జయవీర్ రెడ్డి కోరారు.శనివారం నాగార్జునసాగర్ లోని విజయ విహార్ లో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తో నాగార్జునసాగర్ నియోజకవర్గ పరిధిలో తిరుమలగిరి సాగర్ మండలంలో పెండింగ్ భూముల సమస్యలపై నిర్వహించిన సమీక్ష సమావేశం లో ఆయన మాట్లాడుతూ టీ సాగర్ మండలంలో దీర్ఘకాలిక భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. గత 30 సంవత్సరాలుగా అటవీ భూములు సాగు చేసుకుంటున్న పేద రైతులకు డి- ఫామ్ పట్టాలు ఇవ్వాలని, అసైన్మెంట్ భూముల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఫారెస్ట్ భూములకు డి-ఫామ్ పట్టాలిచ్చే ప్రక్రియ కొనసాగుతున్నదని, వెరిఫికేషన్ పూర్తయిన వెంటనే తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రభుత్వ భూముల పై ప్రస్తుతం ఉన్న వారిని గుర్తించేందుకు ప్రత్యేకంగా నాలుగు బృందాలు ఏర్పాటు చేశామని,గ్రామ స్థాయిలో సర్వే నిర్వహించి, గ్రామ సభల ద్వారా ధృవీకరణ చేపడుతున్నామని తెలిపారు.ఇప్పటివరకు సుమారు 12,000 ఎకరాల భూమి సర్వే పూర్తయిందన్నారు.

సర్వే నంబర్ల ఆధారంగా రికార్డులు సిద్ధం చేస్తున్నామని వివరించారు.రైతుబంధు వంటి పథకాలు దుర్వినియోగం జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు.ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తుల్లో రెవెన్యూ సంబంధిత సమస్యలను పరిష్కరించడంలో చొరవ తీసుకోవడం జరిగిందని చెప్పారు.ఫారెస్టు భూములకు సంబంధించి రెవెన్యూ అధికారులు, సిబ్బంది త్వరితగతిన వెరిఫికేషన్ పూర్తి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మాజీ మంత్రి జానారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రెవిన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి, జిల్లా గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి,,తిరుమలగిరి సాగర్ తహసిల్దార్ అనిల్ తదితరులు ఈ సమీక్షా సమావేశంలో ఉన్నారు.

## శాంతి ఉద్యమంలో అందరూ భాగస్వాములు కావాలి




### ఏఐపిఎస్ఓ రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కే.వి.ఎల్

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 4 (వార్తా వేదిక సూర్య )

యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా శాంతి ఉద్యమాల్లో అందరూ భాగస్వాములు కావాలనీ. ఏఐపిఎస్ఓ రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కే.వి.ఎల్ పిలుపునిచ్చారు. అఖిల భారత శాంతి సంఘీభావ సంస్థ నల్లగొండ జిల్లా కార్యవర్గ సమావేశం శనివారం పట్టణంలోని పి. ఆర్. టి. యు భవనంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కే.వి.ఎల్. హాజరై మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న యుద్ధ వాతావరణం మానవాళికి తీవ్ర ముప్పుగా మారుతోందన్నారు. యుద్ధాల వల్ల సాధారణ ప్రజలే అత్యధికంగా నష్టపోతున్నారని, దేశాల మధ్య శాంతి, సహకారం అత్యవసరమని పేర్కొన్నారు.

అమెరికా--ఇజ్రాయెల్ వలసాధిపత్య ధోరణి ప్రపంచ శాంతికి ప్రమాదంగా మారిందని ఆయన అన్నారు. ఈ రెండు దేశాల దుందుడుకు విధానాలు ప్రపంచాన్ని కల్లోలంలోకి నెట్టుతున్నాయని, ఇది కేవలం సంఘర్షణ మాత్రమే కాదని, ఒక మారణహోమంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మొదట ఇరాక్ 2003 తరువాత వెనిజులా, ప్రస్తుతం ఇరాన్‌పై అమెరికా ఆధిపత్య వైఖరితో దాడులు కొనసాగుతున్నాయని విమర్శించారు. వనరుల కోసం ప్రారంభమైన ఈ యుద్ధాలు ఇప్పుడు నూతన వలసవాద భావజాలంతో నడిచే జాత్యహంకార దాడులుగా మారాయని, వారి లక్ష్యం ఆధిపత్యం తప్ప మరొకటి కాదని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పెరుగుతున్న యుద్ధోన్మాదాన్ని ఖండిస్తూ, ప్రజల్లో శాంతి చైతన్యం పెంపొందించేందుకు. ఈనెల 7న నల్లగొండలో ర్యాలీని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ యుద్ధాల ప్రభావంతో పెట్రోల్, గ్యాస్ మాత్రమే కాకుండా అన్ని నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సాధారణ ప్రజల రోజువారీ జీవితం దుర్భరంగా మారుతోందన్నారు. ఇప్పటికే ట్రంప్ విధించిన ఏకపక్ష సుంకాల ప్రభావంతో దెబ్బతిన్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరో ఆర్థిక మాంద్యం ముంగిట్లో ఉందని తెలిపారు.సీనియర్ నాయకుడు మల్లేపల్లి ఆదిరెడ్డి మాట్లాడుతూ, యుద్ధానికి వ్యతిరేకంగా ఈనెల 7న నల్లగొండలో నిర్వహించనున్న శాంతి ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు అనంతుల శంకరయ్య, కట్ట వెంకట్ రెడ్డి అధ్యక్షత వహించగా, జిల్లా సమన్వయ ప్రధాన కార్యదర్శి జిల్లా యాదయ్య, గుర్రం వెంకట్ రెడ్డి, పశాల శౌరయ్య, కోమటిరెడ్డి ప్రద్యుమ్న రెడ్డి, ముండ్ల ముత్యాలు, షరీపుద్దీన్, పాణెం వెంకట్రావు, ఉప్పునూతల యాదగిరి, కర్నాటి వెంకటేష్, చలం పాండురంగారావు, గుండా లింగారెడ్డి, నిమ్మల భీమర్జున్ రెడ్డి, పి. బ్రహ్మాచారి, తెలగమల్ల దశరథ తదితరులు పాల్గొన్నారు.

## రన్ ఫర్ జీసస్ కార్యక్రమం ఐక్యతకు నాంది

### ఆర్ సి ఎం చర్చ్ నల్గొండ డయాసిస్ బిషప్ కర్ణం ధమన్ కుమార్

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 4 (వార్తా వేదిక సూర్య )

రన్ ఫర్ జీసస్ కార్యక్రమం ఐక్యతకు నాంది పలుకుతుందని ఆర్ సి ఎం చర్చ్ నల్గొండ డయాసిస్ బిషప్ కర్ణం ధమన్ కుమార్ అన్నారు. రన్ ఫర్ జీసస్ అనేది ప్రజల సమైక్యతకు నిదర్శనమని అన్నారు.

శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నల్గొండ డయాసిస్ బిషప్ కర్ణం ధమన్ కుమార్ మాట్లాడుతూ ఐక్యత లేకపోతే ఏది సాధించలేమని, ప్రజలందరూ ఐక్యంగా ఉంటేనే ఏదైనా సాధించగలుగుతామని అన్నారు. ప్రజల్ని రక్షించడానికి, ప్రజలపై మానవత్వాన్ని చూపించడానికి దేవుడు ప్రజల కోసం పరిగెత్తాడని,అదే మానవత్వాన్ని ప్రదర్శిస్తూ ప్రజలంతా ఐకమత్యంగా ముందుకు సాగాలని,




దేవుడు ప్రవచించే మార్గం ఇదేనని అన్నారు. కులాలు, మతాలతో సంబంధం లేకుండా మానవత్వమే ధ్యేయంగా అందరూ ముందుకు సాగాలని, మానవసేవే మాధవసేవ అని అన్నారు. ప్రజలందరూ ఐకమత్యంగా ఉంటూ మానవత్వంతో, వ్యవహరిస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నల్గొండ డిప్యూటీ మేయర్ అష్రఫ్ అలీ ఆమెర్,నల్గొండ మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, టీఎస్ క్రిస్టోఫర్, బాలస్వామి, జయజీవన్ ప్రకాష్, జేమ్స్, పసల శౌరయ్య,



రేఖల భద్రాద్రి,జేపీ ప్రభు చరణ్, ఎస్పీ జయప్రకాష్, పాస్టర్ లవన్ కుమార్, ఎబినేజర్, ఐజాక్ రామ్, జాన్ బాబు, దేవదాస్, సాలమన్, ప్రసాద్ కుమార్, కన్నా డేవిడ్, మోజస్, జాకబ్, లక్ష్మయ్య, ఎలీషా, ప్రవీణ్ కుమార్, అమృత రావు, సాలమన్ రాజు, ప్రదీప్, సామ్యేల్,అబ్రహం,ఆశయ్య, సమర్పన్ కుమార్,సుందర్, నతానియల్ తదితరులు పాల్గొన్నారు.

# శివన్నగూడెం-లక్ష్మణపురం రిజర్వాయర్లను వెంటనే పూర్తి చేసి కాలువల ద్వారా రైతాంగానికి నీటిని అందించాలి

## పాలడుగు నాగార్జున, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డిమాండ్




నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 4 (వార్తా వేదిక సూర్య )

శ్రీశైలం ఎడమ గట్టు కాలువ ద్వారా డిండి ఎత్తిపోతల పథకం నుంచి సాగునీరు, తాగునీరు అందించేందుకు నిర్మిస్తున్న లక్ష్మణపురం, శివన్నగూడెం రిజర్వాయర్లు నత్తనడకన సాగుతున్నాయని, వాటి ద్వారా నీటి సరఫరాలో తీవ్ర అన్యాయం జరుగుతోందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు నాగార్జున విమర్శించారు. శనివారం సిపిఎం మర్రిగూడ మండల కమిటీ సమావేశం నీలకంఠం రాములు అధ్యక్షతన మర్రిగూడ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పాలడుగు నాగార్జున మాట్లాడుతూ..గత పాలకులు రిజర్వాయర్లు నిర్మించినప్పటికీ, వాటికి నీరు అందించేందుకు అవసరమైన కాలువలు, నీటి కేటాయింపులు, డీపీఆర్ ఆమోదంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం, మోసం ప్రదర్శిస్తోందని విమర్శించారు.మునుగోడు ప్రాంతంలో ఫ్లోరైడ్ సమస్య తీవ్రంగా ఉండి, అనేక మంది వికలాంగులుగా మారడమే కాకుండా ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నప్పటికీ, ప్రభుత్వం సమస్య పరిష్కారంలో విఫలమైందని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, ప్రకటించిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.రైతాంగ సమస్యలపై మాట్లాడుతూ..

ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వేగవంతం చేసి ప్రతి గింజను కొనుగోలు చేయాలని, ప్రభుత్వం హామీ ఇచ్చిన బోనస్‌ను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గ్రామాలలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో కనీస కూలీ రేట్లు అమలు చేయడం లేదని, మండుతున్న ఎండల్లో పని చేస్తున్న కూలీలకు గిట్టుబాటు కావడం లేదని తెలిపారు. వేసవికాలంలో అదనపు బోనస్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.ఏప్రిల్, మే నెలల్లో గ్రామ గ్రామాన ప్రజా సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో పర్యటనలు చేపడతామని తెలిపారు. రోడ్లు మరియు ఇతర మౌలిక సదుపాయాల కోసం నిరంతరం ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని చెప్పారు.మునుగోడు ఎమ్మెల్యే ఎన్నికల హామీలకే పరిమితమై, వాటిని అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. ప్రజలతో కలిసి ప్రభుత్వంపై పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం మర్రిగూడ మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య, జిల్లా కమిటీ సభ్యులు నాంపల్లి చంద్రమౌళి, మండల కమిటీ సభ్యులు నీలకంఠం రాములు, దామెర లక్ష్మి, పగిళ్ల రామచంద్రం, గడగోటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## సమిష్టిగా రామన్నపేట నియోజకవర్గం సాధించుకుందాం

రామన్నపేట ( వార్త వేదిక సూర్య )

రామన్నపేట మండలశీ మరియు పరిసర ప్రాంత ప్రజలు , అధికారులు , వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు , ప్రజా సంఘాల నాయకులు అందరూ ఏకమై, రామన్నపేట నియోజకవర్గం సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని, దానికోసం, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, దేశస్థాయి, అధికారులను, కలవడంతో పాటు, అనేక హోదాలలో ఉన్న, రాజకీయ నాయకులను, ప్రజాప్రతినిధులను, రాష్ట్ర, కేంద్ర మంత్రులను కలిసి ,రామన్నపేట కున్న భౌగోళిక పరిస్థితులను, రామన్నపేట కున్న, గత చరిత్రను, వివరిస్తూ రామన్నపేట నియోజకవర్గం సాధన తోపాటు అభివృద్ధిపై దృష్టి పెట్టాలని రాజకీయాలకతీతంగా కలిసి ముందుకు సాగాలని మాజీ జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ తెలంగాణ వెటర్నరీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముక్కామల దుర్గయ్య యాదవ్ పిలుపునిచ్చారు



## వైద్య శిబిరంలో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ వాణి భరత్ గౌడ్

యాదగిరిగుట్ట ఏప్రిల్ 4 (వార్త వేదిక సూర్య ) :

పట్టణంలోని 6వార్డులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్ పర్సన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్ ప్రారంభించారు. ఈ ఉచిత వైద్య శిబిరం లో పలు రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణి చేశారు . ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లింగస్వామి,6వార్డు కౌన్సిలర్ కర్రె మాధవి ప్రవీణ్, వైద్యాధికారి,కాంగ్రెస్ నాయకుడు పెల్లిమెల్లి శ్రీధర్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి..





## వైద్యాధికారి కట్ట విజయ్.. సర్పంచ్ భూమండ్ల జయమ్మ శ్రీనివాస్..

మోటకొండూరు/వార్త వేధిక సూర్య :-

యాదాద్రి- భువనగిరి జిల్లా మూటకొండూరు పి హెచ్ సి నందు ప్రజా పాలన - ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించారు. డాక్టర్ కట్ట విజయ్ , గ్రామ సర్పంచ్ భూమండ్ల జయమ్మ శ్రీనివాస్, ఉప సర్పంచ్ వంగాల నిఖిల్ మహేష్, వార్డు మెంబర్ జూకంటి మధు తో కలిసి రిబ్బన్ కట్ చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సర్పంచ్ జయమ్మ శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామంలో ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని, ఇలాంటి వైద్య శిబిరాలు సద్విని చేసుకోవాలని గ్రామ ప్రజలను కోరారు. డాక్టర్ విజయ్ మాట్లాడుతూ.. వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించిన సులభతర చికిత్సకు అవకాశం ఉండునని, మందులు వాడి, ప్రాణ అపాయానికి దూరంగా ఉండవచ్చు అని తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చిన బి.పి షుగర్ టిబి వంటి వ్యాధుల పై పూర్తిస్థాయి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి 80 మందికి మందులను అందజేశారు. అవసరమైన వారికి పై స్థాయి సుపత్రులకు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది నరసింహ, శ్రీనివాస్, సుభాషిని,యాకయ్య, జ్యోతి నరేష్,ఉమేష్ ,ఆశా కార్యకర్తలు: జ్యోతి,మహాలక్ష్మి ఐలమ్మ కవిత,మమతా, పద్మ, ప్రమీల తో పాటు పంచాయతీ సెక్రటరీ సంతోష్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ ను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

రామన్నపేట ( వార్త వేదిక సూర్య )



ఇటీవల ప్రభుత్వ విప్ గా నియమితులైన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంను రామన్నపేట కాంగ్రెస్ నాయకులు శనివారం ఆయన నివాసంలో కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.... వేముల వీరేశంకు ప్రభుత్వ విప్‌గా నియామకం కావడం గర్వకారణమని, ఆయన నాయకత్వంలో ప్రజలకు మరింత సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రామన్నపేట నియోజకవర్గం గురించి పూర్తి సహాయ సహకారలు అందిస్తాను అను హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో రామన్నపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గరిక సత్యనారాయణ, నీర్నేముల సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డి, జిల్లా నాయకులు జినుకల ప్రభాకర్, ఉప్ప సర్పంచ్ మోట్ రమేష్,సాల్వేరు అశోక్, ఎండి అక్రమ్, ఎండి జమీరుద్దీన్, కొమ్ము రామస్వామి, అబ్దుల్ వహీద్, కోట సుధాకర్, అన్వర్ గొలుసుల ప్రసాద్, ఊట్కూరి శ్రీను, గొరిగే శేఖర్, గంగాపురం శంకర్, తదితరులు పాల్గొన్నారు

## భక్తాంజనేయ స్వామి దేవాలయ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

గుండాల వార్తవేదిక సూర్య ప్రతినిధి ఏప్రిల్ 04 :







సుద్దాల గ్రామంలో ఉన్న శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయ కమిటీకి సంబంధించిన ఎన్నికలు ఏకగ్రీవంగా పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ పాలక కమిటీ చైర్మన్‌గా బత్తిని మహేష్ గౌడ్ ని నియమిస్తూ ఆలేరు ఎమ్మెల్యే, తెలంగాణ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య దేవాదాయ శాఖకు సిఫారసు చేశారు.

గ్రామ ప్రజల అభిప్రాయం, కమిటీ సభ్యుల ఏకగ్రీవ నిర్ణయం మేరకు ఈ సిఫారసు చేయబడింది. మహేష్ గౌడ్ సేవా దృక్పథం, ఆలయ అభివృద్ధిపై ఉన్న ఆసక్తి దృష్ట్యా ఆయనను చైర్మన్‌గా ఎంపిక చేయడం జరిగిందని నాయకులు తెలిపారు,

ఈ సిఫారసును దేవాదాయ శాఖ అధికారులు వెంకట విజయలక్ష్మి పరిశీలించి ఆమోదం తెలిపారు. దీంతో బత్తిని మహేష్ గౌడ్ అధికారికంగా ఆలయ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించనున్నట్లు స్పష్టం అయ్యింది,ఈ నిర్ణయంపై గ్రామంలో ఆనంద వాతావరణం నెలకొంది. భక్తులు, గ్రామ పెద్దలు, యువకులు మహేష్ గౌడ్ కి అభినందనలు తెలియజేస్తున్నారు. ఆయన నాయకత్వంలో ఆలయం మరింత అభివృద్ధి చెందాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు,

మహేష్ గౌడ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ,తనపై నమ్మకం ఉంచిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గారికి, దేవాదాయ శాఖ అధికారులకు, గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు,

కమిటీ నెంబర్స్ పులకంటి రామ్ రెడ్డి గూడ, రవి యమ గాని మహేష్, తుంగ తిరుపతి, ఎక్స్ అఫీషియో నాయిని కృష్ణారెడ్డి,లను నియమించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు జంపాల సోమన్న యమ గాని బాలు, చిన్న గౌడ్, నాగేష్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు...

# ఆరోగ్యం పట్ల అవగాహనతో ఉందాం




## గ్రామాలను ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా మారుద్దాం డాక్టర్- గోంగూర వెంకటేశ్వర్లు

బోనకల్, (వార్త వేదిక సూర్య)




గ్రామాలన్నీ సంపూర్ణ ఆరోగ్య గ్రామాలుగా ఉండాలని కాంక్షిస్తూ.. ప్రతి ఒక్కరు ఆరోగ్య విషయాల పట్ల అవగాహన కలిగి ఉండాలని శ్రీరక్ష హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఆయన చేస్తున్న శ్రీరక్ష ఆరోగ్య యాత్రలో భాగంగా శనివారం మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో ప్లకార్డుల ప్రదర్శనతో ఆరోగ్య యాత్ర చేశారు. బీపీ, షుగర్, గ్యాస్ట్రో, లివర్,క్యాన్సర్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ

30 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు ప్రతి మూడు నెలల నుంచి ఆరు నెలల మధ్యకాలంలో వైద్య పరీక్షలు చేయించుకుని, వైద్యుల సలహాలతో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్నారు.

గ్రామాలను ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా మార్చి పర్యావరణాన్ని, ఆరోగ్యాన్ని కాపాడుకుందామన్నారు.. ప్లాస్టిక్ వాడకం, దాని దుష్పరిమాణామాలను వివరించారు. పర్యావరణానికి, రైతుల ఆరోగ్యానికి ముప్పుగా మారిన పరాక్వాట్ గడ్డి మందును నిషేధించడానికి ప్రభుత్వం ముందడుగు వేయడం, వరంగల్ ఎంపీ కడియం కావ్య ఈ గడ్డి మందు నిషేధంపై పార్లమెంట్ లో గళమెత్తడం అభినందనీయమన్నారు. ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తూ యాత్ర చేస్తున్న డాక్టర్ జీవీ ని గ్రామ సర్పంచ్, పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతాపూర్వకంగా సన్మానించారు.ఆరోగ్య యాత్రకు సహకరించిన సర్పంచ్ తెల్లబోయిన నాగేశ్వరరావు, పాలకవర్గ సభ్యులకు, గ్రామ పెద్దలకు డాక్టర్ జీ వి శాలువాలు కప్పి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బండి సైదమ్మ, మాజీ సర్పంచ్ మర్రి తిరుపతిరావు, పారా కోటేశ్వరరావు, బండి పుల్లయ్య, గద్దల వెంకటేశ్వర్లు, శ్రీ రక్షా వైద్య సిబ్బంది అరుణ్ కుమార్, శ్రీకాంత్, కమలాకర్, కృపా,కిరణ్, గజ్జల శ్రీనివాస్ మణికాంత్, యశ్వంత్, నాగేశ్వరరావు, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ క్యాంపు కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండించిన - సైదులు యాదవ్

ఆత్మకూరు (ఎం), ఏప్రిల్ 04 (వార్త వేదిక సూర్య):



యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం గజ్వేల్‌లో ప్రధాన ప్రతిపక్ష నేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై జరిగిన దాడిని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సైదులు యాదవ్ తీవ్రంగా ఖండించారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధుల కార్యాలయాలపై ఇలాంటి దాడులు జరగడం ప్రజాస్వామ్యానికి మచ్చగా నిలుస్తుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ విభేదాలు హింసకు దారి తీయకూడదని, ఇలాంటి ఘటనలు జరగడం సరైంది కాదని, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే, ఇక సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా ప్రతినిధుల కార్యాలయాల భద్రత బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీస్తాయని, భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# బూత్ స్థాయి బలోపేతమే లక్ష్యం

▸▸ భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు

**మోత్కూరు, ఏప్రిల్ 04 (వార్తా వేదిక సూర్య):** బూత్ స్థాయి బాజపా బలోపతం లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుల పనిచేయాలని భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు , సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలత రెడ్డి లు పిలుపునిచ్చారు. శనివారం మున్సిపల్ కేంద్రంలో భాజపా పట్టణ మండల రూరల్ అడ్డగూడూరు మండలాల కార్యకర్తలకు నాయకులకు ప్రశిక్షణ మహాబీ యాస్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభి ంచారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ ఈ ప్రశిక్షణ శిబిరం ద్వారా కార్యకర్తలు పార్టీ సిద్ధాంతాలు, విధానాలు, కార్యాచరణపై స్పష్టమైన అవగాహన పొందాలని తెలిపారు. ఆ అవగాహనను ప్రజల్లోకి తీసుకె ళ్లడం ప్రతి కార్యకర్త బాధ్యత అని పేర్కొ న్నారు. బూత్ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేయడంలో కార్యకర్తల పాత్ర అత్యంత ముఖ్యమని, ప్రతి కార్యకర్త సమన్వయంతో పని చేస్తే పార్టీ మరింత విస్తరిస్తుందని అన్నారు. ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ, సేవా భావంతో ముందుకు సాగాలని సూచిం చారు. ప్రశిక్షణ శిబిరం ద్వారా కార్యకర్తలకు సిద్ధాంతప రమైన సంస్థాగత పరమైన అవగా హన పెంపొం దించబడు తుందని అన్నారు మోత్కూర్ పట్టణ అధ్యక్షులు చాడ మంజుల అధ్యక్షతన జరిగినఈ కార్యక్రమంలో శిక్షణ తరగతుల కన్వీనర్, జిల్లా వంగవీటి శ్రీనివాస రావు మోత్కూర్ రూరల్ అధ్యక్షులు, గుదే మధు సూదన్ యాదవ్, అడ్డగూడూర్ మండల అధ్య క్షులు ననుబోతు సైదులు, బిజెపి సీనియర్ నా యకులు దాసరి మల్లేశం, బందారపులింగ స్వామి, కొనతం నాగార్జున రెడ్డి జిల్లా కోశాది కారి గుజ్జ సోమ నరసయ్య జిల్లా నాయకుల బయ్యని చంద్రశేఖర్, శిక్షణ తరగతుల ప్రబారి గౌరు శ్రీనివాస్ ఏనుగు జితేందర్ రెడ్డి సోమిరెడ్డి నర్సిరెడ్డి జిల్లా నాయకులు కూరాకుల వెంకన్న పోచం సోమయ్య తిరుమల్ రెడ్డి సజ్జన మనో హర్ ఎడ్ల రాము జిలకర దశరథ మల్లేశం సత్యనా రాయణ చంద్రమౌళి విజయలక్ష్మి, రమణ,రేణుక రమాదేవి, పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**మోత్కూరు, (అడ్డగూడూరు ) ఏప్రిల్ 04 (వార్తా వేదిక సూర్య):** అడ్డగూడూరు మండలంలోని చిర్రగూడూరు గ్రామానికి చెందిన ఖమ్మంపాటి హనుమంత్ ఇటీవల ఆరోగ్యానికి గురై హైదరాబాద్ లో ప్రైవేట్ హాస్పిటల్ చికిత్స పొందుతూ మంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన హనుమంత్ కు స్థానిక ఎమ్మెల్యే సామేల్ సహకారంతో 50,000 వేలు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మంజూరైన చెక్కును డిసిసి ఉపాధ్యక్షులు నిమ్మనగోటి జోజి బాధిత లబ్ధిదారుడు హనుమంత్ కు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా జోజి మాట్లాడుతూ నిరుపేద అభాగ్యులకు ముఖ్యమంత్రి సహా అనేది కొండంత అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట స్థానిక సర్పంచ్ చిత్తలూరి సోమనారాయణ, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నాయకులు చిత్తలూరు సోమనర్సింహ్మ ఉన్నారు.

## కెసిఆర్ క్యాంప్ కార్యాలయంపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

▸▸ బి.ఆర్.ఎస్ డిమాండ్



**మోత్కూరు, ఏప్రిల్ 04 (వార్తా వేదిక సూర్య ):** తెలంగాణ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా పదేళ్లు రాష్ట్రాన్ని పరిపాలించిన మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కెసిఆర్ లక్ష్యం చేసుకొని గజ్వేల్ లో ఉన్న కెసిఆర్ క్యాంప్ కార్యాలయం పై దాడి చేసి ఫర్నిచర్ ధ్వంసం చేసిన కాంగ్రెస్ పార్టీ అల్లరి మూకలతీరును తీవ్రంగా ఖండిస్తున్నట్లు బారాస మండల అధ్యక్షులు పొన్నెబోయిన రమేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొనతం యాకుబ్ రెడ్డి లు తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ కెసిఆర్ ను రాజకీయంగా ఎదుర్కొనలేక కాంగ్రెస్ నేతలు నీచమైన దాడులకు దిగడం ఆ పార్టీ దివాలా రాజకీయాలకు నిదర్శనమన్నారు. ప్రజల ప్రేమ విశ్వాసం సంపాదించిన కేసీఆర్ ఇలాంటి అల్లరి మూకాలను ఎంతోమంది చూశారని,కాంగ్రెస్ కు దమ్ము ధైర్యం ఉంటే రాజకీయంగా కేసీఆర్ ను ఎదుర్కొనాలని అన్నారు. కెసిఆర్ కార్యాలయం పై దాడి జరిగిందంటే అది కేసీఆర్ పై కాదని, తెలంగాణ భావిజాలం పైన దాడి చేసినట్లేనని పేర్కొన్నారు. కెసిఆర్ కార్యాలయం పై దాడి చేసిన కాంగ్రెస్ పార్టీ చెందిన అల్లరి మూకలను కఠినంగా శిక్షించాలని వాడు డిమాండ్ చేశారు.

## భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా మురళీధర్ రెడ్డి నియామకం పట్ల హర్షం

**మోత్కూరు, ఏప్రిల్ 04 (వార్త వేదిక సూర్య ):** భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి చెందిన తుమ్మల మురళీధర్ రెడ్డి ఎన్నిక పట్ల భాజాపా మండల అధ్యక్షులు గుదే మధుసూదన్ యాదవ్ శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మురళీధర్ రెడ్డి ఎన్నికతో జిల్లాలో బాజప బలోపతం కానున్నదని ఆశాభావం వ్యక్తం చేశారు.

## కెసిఆర్ క్యాంప్ కార్యాలయంపై పిరికిపంద చర్య



**మోత్కూరు, ఏప్రిల్ 04 (వార్తా వేదిక సూర్య ):** ఇందిరమ్మ రాజ్యం లో అని చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రాన్ని పూర్తిగా గుండాల రాజ్యంగా మార్చిందని బారాస పట్టణ అధ్యక్షులు జంగ శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష నేత క్యాంపు కార్యాలయం పైనే దాడులు జరుగుతుంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నట్లా లేనట్లా అని ప్రశ్నించారు. పోలీసులు చట్టాన్ని కాపాడవాల్సింది పోయి కాంగ్రెస్ కు ప్రైవేట్ సైన్యం లాగా వ్యవహరించడం దుర్మార్గమ న్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కెసిఆర్ ఇలాంటి చిల్లర రాజకీయాలను ఎంతోమంది చూశారని, రానున్న రోజుల్లో ప్రజల పక్షాన కేసీఆర్ పోరాటాలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దించేదాకా పోరు సాగుతుందన్నారు. ఈ క్యాంప్ కార్యాలయం పై దాడి ముమ్మాటికీ పిరికిపంద చర్య నేనని అన్నారు.

## తాటిచెట్టుపై నుండి గీత కార్మికుడికి తీవ్ర గాయాలు



**మోత్కూరు, ఏప్రిల్ 04 (వార్తావేదిక సూర్య);** మండలంలోని పాటిమాట్ల గ్రామానికి చెందిన రాచకొండ సుధాకర్ గౌడ్ వృత్తి రీత్యాలో భాగంగా ప్రతిరోజు మాదిరిగానే శనివారం తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టు పైనుండి జారి పడి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన సుధాకర్ గౌడ్ ను కుటుంబ సభ్యులు, స్థానికులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ కు తరలించారు. తీవ్రంగా గాయపడిన సుధాకర్ గౌడ్ ను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని మాజీ ఉపసర్పంచ్ గిరగాని శ్రీనివాస్ కోరారు.

## ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలల్లో ఆదరణ

▸▸ రాష్ట్ర పోలీస్ కంప్లైంట్ అథారిటీ బోర్డుమెంబర్ డా వర్రే వెంకటేశ్వర్లు



**మోత్కూరు, ఏప్రిల్ 04 (వార్తా వేదిక సూర్య):** తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం నడుస్తున్న ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంతో ప్రజల్లో పోలీసుల పట్ల భయం తొలగి నమ్మకం ఏర్పడిం దని రాష్ట్ర పోలీసు కంప్లైంట్స్ అథారిటీ బోర్డ్ మెంబర్ డా వర్రే వెంకటేశ్వర్లు అన్నారు. శని వారం ఆయన 'వార్త వేదిక సూర్య" ప్రతినిధితో మాట్లాడుతూ ప్రజలు, పోలీసులకు మధ్య సత్సంబంధాలు ఏర్పడడంతో ప్రజలు తమకు జరిగే అన్యాయాల పట్ల నేరుగా పోలీసు స్టేషన్‌కి వెళ్లి చెప్పుకుంటున్నారన్నారు.

శాంతి భద్రతలను కాపాడటంలో ప్రజలు సైతం పోలీసు లకు సహకరించాలన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవించడంతో పాటు, చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలీస్ వ్యవస్థ పై విశ్వా సాన్ని పెంపొందించేందుకు పోలీస్ కంప్లైంట్స్ బోర్డ్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ప్రభుత్వ అభివృద్ధి,సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు అయ్యేందుకు విద్యావంతులు, మేధావులు, ఉద్యోగులు, యువకులు, ఎన్జీవో సంస్థలు, మీడియా ప్రతినిధులు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.

## 11న రామన్నపేటలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభల సన్నాహక సమావేశం



**వలిగొండ, ఏప్రిల్ 4 (వార్తా వేదిక సూర్య)** ఏప్రిల్ 11వ తేదీన రామన్నపేటలో జరిగే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మూడవ జిల్లా మహాసభల సన్నాహక సమావేశాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిర్పంగి స్వామి పిలుపునిచ్చారు. శనివారం రోజున సుంకిశాల గ్రామంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ కార్మిక సంఘాలు,వామపక్ష పార్టీల, అనేక పోరాటాల ఫలితంగా ఏర్పడిన గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు విబిజి రామ్ జి అనే పేరుతో నూతన చట్టాన్ని ఏర్పాటుచేసి కూలీలకు పని అడిగే హక్కు లేకుండా రాష్ట్రాలు ముందస్తుగా కేంద్రానికి నిధులు చెల్లిస్తేనే పనులు తిరిగి కల్పిస్తామని చట్టం చేసిందన్నారు దీంతో ఆర్థిక ఇబ్బందులతో ఉన్న రాష్ట్రాలపై మరింత భారాన్నివేస్తూ ఈ పేరుతో కూలీలకు పనులు కల్పించకుండా కుట్రలు చేస్తుందని కూలీలందరూ కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాటాల్లోకి రావాలని పిలుపునిచ్చారు.

మే 18,19 తేదీల్లో నిర్వహించే జిల్లా మహాసభల జయప్రదం కోరుతూ ఈనెల 11వ తేదీన రామన్నపేటలో వ్యవసాయ కార్మిక సంఘం సన్నాక సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సమావేశంలో వ్యవసాయ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిఎన్ఎం జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు జిల్లా కమిటీ సభ్యులు కొండే కిష్టయ్య, నాయకులు నార్కట్పల్లి ఎల్లయ్య,రాములు, లక్ష్మమ్మ,దేశపాక మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరి బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా విశిష్ట సేవలు

### అడ్వకేట్ సాయి సౌరిష్ రావుకు సత్కారం



**మల్కాజిగిరి, ఏప్రిల్ 04,(వార్తా వేదిక సూర్య ):** మల్కాజిగిరి బార్ అసోసియేషన్ తరపున అడ్వకేట్ జి. సాయి సౌరిష్ రావు కి ప్రశంసా పత్రం (అప్రెసియేషన్ అవార్డు) ప్రదానం చేయడం జరిగింది. అసోసియేషన్‌లో ఎగ్జి క్యూటివ్ మెంబర్‌గా ఆయన అందించిన నిబద్ధతతో కూడిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం అందజేశారు. న్యాయవృత్తి పట్ల అంకితభావంతో పాటు, సంఘ అభివృద్ధికి ఆయన చేసిన కృషి విశేషమని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. న్యాయవాదుల సంక్షే మం, సమస్యల పరిష్కారం, సంఘ ఐక్యత పెంపొందింపులో ఆయన కీలక పాత్ర పోషిం చారని కొనియాడారు. యువ న్యాయవాదులకు మార్గదర్శకత్వం వహిస్తూ, సంఘ కార్యక్రమాల ను సమర్థవంతంగా నిర్వహించడంలో ఆయన చూపిన నాయకత్వం ప్రశంసనీయం అని పేర్కొ న్నారు. ఈ సందర్భంగా అదనపు జిల్లా న్యాయ మూర్తి తిరుపతి అవార్డును ప్రదానం చేసి, అడ్వ కేట్ సాయి సౌరిష్ రావు సేవలను అభినం దించారు. న్యాయరంగంలో ఆయన మరింత ఉ న్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షిం చారు. ఈ అవార్డు ఆయన సేవలకు లభించిన గౌరవప్రదమైన గుర్తింపుగా నిలుస్తుందని, భవి ష్యత్తులో ఇలాగే సేవలు కొనసాగిం చాల ని అ సోసియేషన్ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం



**మోత్కూరు, ఏప్రిల్ 04,(వార్తా వేదిక సూర్య ):** మండలంలోని దత్తప్పగూడెం గ్రామానికి చెందిన జినుకల అంజయ్య శనివారం ఆకాల మృతి చెందారు. ఆయన ఆకాలమృతి పట్ల ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరిరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం అంజయ్య దేహానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి, 5000 రూపాయలు కుటుంబ సభ్యులకు అందజేశారు.

## పాడి పశువుల యూనిట్లకు దరఖాస్తు చేసుకోవాలి

**మోత్కూరు, ఏప్రిల్ 04 (వార్త వేదిక సూర్య ):** ఎస్సీ కార్పొరేషన్ 2025 -26 సంవత్సరం యాక్షన్ ప్లాన్ లో మోత్కూరు మండలానికి 2 పాడి పశువుల యూనిట్లు మంజూరు అయ్యాయని అర్హులైన వారు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ బాలాజీ నాయక్ తెలిపారు. శనివారం ఎంపీడీఓ విలేకరులతో మాట్లాడుతూ ఒక పాడి పశువు యూనిట్ ధర 2.40 లక్షల ఉందని, అందులో రూ. 1.68 లక్షలు సబ్సిడీ ప్రభుత్వం అందజేస్తుందని రూ 72 వేల బ్యాంకు రుణం తీసుకోవాలని తెలిపారు. దరఖాస్తుధారుడు ఖ చ్చితంగా 0-10 గుంటలు సొంత భూమి, లీజుభూమి ఏదైనా కలిగి ఉండటంతో పాటు నీటి సదుపాయం ఉండాలని తెలిపారు. అర్హులైన దరఖాస్తుదారులు ఈనెల 08వ వరకు ఓబి ఎంఎంఎస్ ( సి.బి ఎంఎంఎస్ ) వెబ్ సైట్ ద్వారా అప్లై చేసుకోవాలన్నారు. అప్లై చేసిన వారు వెబ్ సైట్ జిరాక్స్ ఫారం, భూమి పాస్ బుక్ ,కుల, ఆదాయ సర్టిఫికేట్ బ్యాంక్ పాస్ బుక్,ఆధార్ కార్డ్,పాన్ కార్డు జిరాక్స్ కాపీలు 2 పాస్ ఫోటోలు ఎంపీడీవో కార్యాలయంలో లో అందజేయాలని కోరారు. అర్హులైన లబ్ధిదారులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మోరిపిరాల అంగన్వాడీలో అక్షర అభ్యాసం - ఆరోగ్య లక్ష్మీ కార్యక్రమం



**ఆత్మకూరు (ఎం), ఏప్రిల్ 04, (వార్త వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం మోరిపిరాల అంగన్వాడీ సెంటర్ లో చిన్నారి విద్యార్థులకు అక్షర అభ్యాసం నిర్వహించి గర్భిణీ మహిళలకు, తల్లులకు ఆరోగ్య లక్ష్మీ పౌష్టిక ఆహారాన్ని అందించారు. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా మోరిపిరాల గ్రామ సర్పంచ్ ఆంబోజు ధనమ్మ శంకరయ్య హాజరై మాట్లాడుతు ప్రతి చిన్నారిని అంగన్వాడీ వయస్సు రాగానే అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలని పిల్లలకు విద్యార్థి దశకు వెళ్లే ముందు ప్లే స్కూల్ ద్వారా విద్య అభ్యసించడానికి మానసికంగా సిద్ధం చేస్తారని, ప్రతి గర్భిణీ మహిళ, చిన్న పిల్లల తల్లులు అంగన్వాడీ సెంటర్ లో ఆరోగ్య లక్ష్మీ క్రింద ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టిక ఆహారాన్ని స్వీకరించి జన్మించే శిశువు,జన్మించిన పిల్లలు ఆరోగ్యంగా ఉండేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమం లో అంగన్వాడీ టీచర్ బూడిద గౌరమ్మ, స్థానిక పాఠశాల సైన్స్ టీచర్ సౌమ్య,ఆయా పుట్టల కృష్ణవేణి,గర్భిణీ మహిళలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి భువనగిరి **వార్త వేదిక సూర్య** సంపుటి : 1 సంచిక : 309
యాదాద్రి భువనగిరి ఆదివారం, ఏప్రిల్ 5, 2026

# గిరి ప్రదక్షిణలో పాల్గొన్న ఈవో భవాని శంకర్



**యాదగిరిగుట్ట, ఏప్రిల్ 4 (వార్త వేదిక సూర్య) :** తెలంగాణ ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం పురస్కరించుకొని శనివారం దేవస్థానం ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ నిర్వహించారు. తెల్లవారుజామున 5:30 గంటలకు వైకుంఠ ద్వారం వద్ద స్వామివారి పాదాలకు ఈవో భవాని శంకర్ ప్రత్యేక పూజలు చేసి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. భక్తులు స్వామివారి కొండ చుట్టూ రెండున్నర కిలోమీటర్లు గిరి ప్రదక్షిణ చేశారు. గిరి ప్రదక్షిణ చేసిన అనంతరం భక్తులు కాలినడకన కొండపైకి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఎస్పీఎఫ్ ఆర్ ఐ శేషగిరిరావు, ఎస్సై రవి, సిబ్బంది నందు నాయక్, రమేష్, హోంగార్డు భాస్కర్, స్థానికులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక సహాయం అందజేసిన ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత



**వలిగొండ, ఏప్రిల్ 4 (వార్తల వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణ కేంద్రానికి చెందిన దయ్యాల బాలరాజు గత కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు. వారి కుటుంబ సభ్యులను ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత బిఆర్ఎస్ జిల్లా నాయకులు ఎలిమినేటి జంగారెడ్డి పరమర్శించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు 10,000/- రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కౌడే కృష్ణ, బీసీ సంఘం మండల అధ్యక్షులు సాయిని యాదగిరి బిఆర్ఎస్ నాయకులు పలుసం రాజు, ఏజేఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



**మోత్కూరు, ఏప్రిల్ 4 (వార్తా వేదిక సూర్య ):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అగ్నిమాపక కేంద్రం అధికారులు శనివారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక కేంద్రం అధికారులు మాట్లాడుతూ, వ్యాపార సంస్థల్లో ప్రధానంగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. అలాంటి ప్రమాదాలను నివారించేందుకు వ్యాపారులు పూర్తి అవగాహనతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగినప్పుడు నీటిని ఉపయోగించకూడదని, అలా చేస్తే ప్రమాదం మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇలాంటి పరిస్థితులల్లో సి.ఓ.టూ ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లను వినియోగించడం ద్వారా మంటలను సులభంగా అదుపులోకి తీసుకురావచ్చునని వివరించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది బి.రవీంద్ర నాయక్, ఎండి. సిద్ధిక్, బి.అర్వపల్లి తదితరులు పాల్గొన్నారు.










# స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక వేడుకలు

**యాదగిరిగుట్ట ఏప్రిల్ 4 (వార్త వేదిక సూర్య ) :** ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం పురస్కరించుకొని శనివారం ఆలయంలో స్వామివారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయంలో స్వామివారికి నిత్య పూజల అనంతరం అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. ప్రధానాలయ ముఖ మంటపంలో 108 కలశాలను వరుస క్రమంలో పేర్చి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కలశాల లో మంత్రపూరితమైన జలంతో స్వామివారిని అభిషేకి ంచారు. స్వామివారి అనుబంధాలయమైన పాత గుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానఅర్చకులు సురేంద్ర చార్యులు, ఉప ప్రధానార్చకులు లక్ష్మణ్ కుమార్ చార్యులు, మంగళగిరి నరసింహమూర్తి, వేణుగోపాలాచార్యులు, కిరణ్ కుమార్ చార్యులు, మురళీ కుమార్ చార్యులు, భరత్ కుమార్ చార్యులు, నరేష్ చార్యులు, ప్రసన్న రాఘవాచార్యులు, శ్రీనాథ్ చార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# యేసు క్రీస్తు ప్రేమను సమాజానికి చాటి చెప్పేదే రన్ ఫర్ జీసస్

- టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి
- యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణం లో నిర్వహించిన రన్ ఫర్ జీసస్ కార్యక్రమం లో పాల్గొన్న నిర్మలా జగ్గారెడ్డి







**సంగారెడ్డి, ఏప్రిల్ 4, (వార్త వేదిక సూర్య) :** ఈస్టర్ సందర్భం గా సంగారెడ్డి పట్టణం లో యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంగారెడ్డి పట్టణం లోని ఓల్డ్ బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం నుండి మొదలుకుని పోతీ రెడ్డి పల్లి చౌరస్తా వరకు అక్కడి నుండి సిఎస్ఐ చర్చ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కీర్తనలు పాడుతూ, నృత్యాలు చేస్తూ క్రీస్తును స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ యేసు పునరుత్థానం ను స్మరించుకుంటు , యేసు ప్రేమను ఈ సమాజానికి తెలుపడానికి రన్ ఫర్ జీసస్ దోహదపడుతుంది అని ఆమె అన్నారు.

ఈ కార్యక్రమంలో టీ పిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జార్జ్, నాయకులు కూన సంతోష్ లతో పాటు యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం. నాయకులు .. రూబీన్ రెడ్డి, ప్రవీణ్, సునీల్ నిర్మల్ కుమార్, మధు మోహన్, సునీల్ జై కుమార్,.పాస్టర్ లు రెవరెండ్ జార్జ్ ఎబినైసర్, రెవరెండ్ మధు కుమార్, రెవరెండ్ జాన్ పీటర్, సత్యానంద్, సత్య పాల్ పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన



**మోత్కూరు, ఏప్రిల్ 04 (వార్తా వేదిక సూర్య):** సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని మోత్కూరు సిఐ సి వెంకటేశ్వర్లు ,ఎస్ఐ సతీష్ కుమార్ లు అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని కొండగడప గ్రామంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుర్తు తెలియని సైబర్ నేరస్తులు ఫోన్ ప్రజలకు ఫోన్ నెంబర్లకు, కాల్స్ చేస్తూ. మెసేజ్ లు, ఓటీపీలు పంపుతుంటారని వాటిని నమ్మొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో 4వ,కౌన్సిలర్ కొండ శోభ సోంమల్లు, మాజీ ఎంపిటిసి లెంకల వేణు,వార్డు ఆఫీసర్ మున్సిపల్ ,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు..

# పట్టించుకోని అధికారులు

**మోత్కూరు, ఏప్రిల్ 04 (వార్త వేదిక సూర్య ):** మోత్కూరు మున్సిపాలిటీలోని చెరువు కట్ట చౌరస్తాలో గత వారం రోజులుగా పట్టపగలే వీధి దీపాలు వెలుగుతూ విద్యుత్ వృథాకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. సాధారణంగా సూర్యోదయం కాగానే ఆపివేయాల్సిన ఈ వీధి దీపాలు, మధ్యాహ్నం వేళలో కూడా వీధి దీపాలు వెలుగుతుండటంతో స్థానిక ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వేసవికాలం కావడంతో విద్యుత్ వినియోగం పెరిగి, అక్కడక్కడ కోతలు విధిస్తున్న ఈ తరుణంలో మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



మున్సిపల్ సిబ్బంది , అధికారులు కానీ..ఈ వీధి దీపాలను ఆపివేయడంలో కనీస శ్రద్ధ చూపడం లేదని, ప్రజా ధనం ఇలా వృథా కావడంపై పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే ఆ వీధి దీపాలను ఆపివేయించడమే కాకుండా, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.


పదవీ విరమణ శుభాకాంక్షలు



మీ కుటుంబ సభ్యులు, మీ బంధువులు, మీ ఆఫీసులో ఉద్యోగులు
ఎవరైనా రిటైర్డ్ అవుతున్నారా ! అయితే వారికి మీరు
శుభాకాంక్షలు తెలుపాలనుకుంటున్నారా
మా వార్త వేదిక సూర్య దినపత్రిక
ద్వారా తెలియజేయగలరు.
పూర్తి వివరాలకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.
సెల్: 9985389183, 7386949183


Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305**, Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**